www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
04-09-2024
సంపుటి : 01 | సంచిక : 123 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD

## అపరాజిత బిల్లు చరిత్రాత్మకం

బిల్లుపై గవర్నర్ సంతకం చేయాలని విపక్షాలు అడగాలి

- అమలు చేసే బాధ్యత మాది
- దోషులకు మరణశిక్ష విధించాలి
- సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నాం
- ఈ బిల్లు ద్వారా కేంద్రచట్టంలోని లోపాలను సరిదిద్దే ప్రయత్నం
- ఈ బిల్లు పాస్ అయితే.. ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేస్తాం
- బెంగాల్ అసెంబ్లీలో మాట్లాడిన మమతా బెనర్జీ


09

## జీహెచ్ఎంసీ విస్తరణలో తొలిఅడుగు

మున్సిపాల్టీల్లో గ్రామాల విలీనం

ఓఆర్ఆర్ లోపలి పంచాయతీలపై ఆర్డినెన్స్ జారీ చేసిన సర్కారు



3



# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

## అందుకు పక్కా ప్రణాళిక రూపొందిస్తాం

> చెరువులు, నాలాల ఆక్రమణల కారణంగా వర్షాల సమయంలో వరదలు సంభవించి కాలనీలకు కాలనీలే మునిగిపోతున్నాయి. ఆక్రమణల తొలగింపునకు పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆకేరు ప్రవాహంపై శాస్త్రీయంగా అంచనా వేసి నూతన వంతెన నిర్మిస్తామని, నీటిని సమీపంలోని చెరువులు, కుంటలకు మళ్లించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో వర్షపాతం నమోదైనా ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించగలిగామని తెలిపారు. ఈ సమయంలో ప్రాంతం, రాజధాని వంటివి చూసుకోకూడదని అన్నారు. భారీగా నష్టం వాటిల్లినందునే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్రంలో పర్యటించాలని కోరామన్నారు. ఖమ్మంలో మంత్రి పొంగులేటి నివాసంలో మంగళవారం విలేకరులతో ఇష్టాగోష్టిలో, మహబూబాబాద్ జిల్లా సమీక్షలో ఈ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

- ప్రకృతి విపత్తులపై బ్లూ బుక్ తయారు చేసుకోవాలి
- మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై సమీక్షిస్తాం
- మూడు తండాలను కలిపి ఒకే ఆదర్శ కాలనీగా నిర్మించాలి
- పువ్వాడ ఆక్రమణల తొలగింపునకు హరీశ్ సహకరిస్తారా..?
- మహబూబాబాద్ జిల్లా సమీక్షల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యువ శాస్త్రవేత్త అశ్వినీ కుటుంబ సభ్యులకు ఓదార్పు..
- వరద సహాయక చర్యలకు ప్రభుత్వ ఉద్యోగుల రూ.135 కోట్ల విరాళం..

**విశ్వంభర, ఖమ్మం, మహబూబాబాద్:**

ప్రకృతిని చెర బడితే అది ప్రకోపిస్తుందని.. ప్రకృతి ప్రకోపంతోనే ఉత్తరాఖండ్‌లోనైనా, మన దగ్గరైనా విపత్తులు సంభవిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించి కాలనీలకే కాలనీలే మునిగిపోవడానికి కారణం చెరువులు, నాలాల ఆక్రమణే కారణమన్నారు. హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే డిమాండ్ వస్తోందని, కానీ ఎక్కడికక్కడ కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణ తొలగింపును ప్రాధాన్యంగా పెట్టుకున్నామని, చెరువులు, నాలాల ఆక్రమణలో ఎంతటి వారున్నా తొలగింపునకు వెనుకాడబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముందుగా చెరువులు, నాలాల ఆక్రమణపై నివేదిక రూపొందించుకోవాలని, ఏవైనా కోర్టు కేసులు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో కేవలం ఒక నాలాపై ఆక్రమణలు తొలగిస్తేనే రాం నగర్‌లో ముంపు బారి నుంచి బయటపడిన విషయాన్ని ముఖ్యమంత్రి ఉదాహరించారు. మిగతా2లో...

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు

- అధికారులైనా..టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులైనా చర్యలు తప్పవు
- చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలి
- అధికారులంతా మానవతా దృక్పథంతో పనిచేయాలి
- ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులూ ఒడ్డి సేవ చేయాలి
- ప్రభుత్వం తరపున చేయాల్సిందంతా చేస్తాం
- విజయవాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం చంద్రబాబు


10

### తెలుగు రాష్ట్రాలకు అండగా ఉంటాం

- జాతీయ విపత్తు ఎక్కడా ప్రకటించడం లేదు
- ఎస్డీఆర్ఎఫ్‌లో ఉన్న రూ.1,345 కోట్లను తెలంగాణ వినియోగించాలి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి


09

### తెలంగాణలో విద్యా కమిషన్ ఏర్పాటు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- ఒక చైర్మన్, ముగ్గురు సభ్యులు త్వరలో నియామకం
- ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ
- మూడు ప్రధాన లక్ష్యాలతో కమిషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం

2




2

### ఖమ్మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ

సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ వాహనాలపై రాళ్లదాడి

పువ్వాడ కారు ధ్వంసం...ఇద్దరికి గాయాలు

## బీఆర్ఎస్ నేతల వాహనాలపై దాడి కాంగ్రెస్ అసహనానికి నిదర్శనం

- దాడికి గురైన నేతలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్న కేటీఆర్
- సంఘటనకు ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- దాడులకు బెదరం.. ఎన్ని దాడులు చేసినా ప్రజలకు అండగా ఉంటాం
- ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండించిన కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:**

ఖమ్మం జిల్లా కేంద్రంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ వారు చేసిన దాడిపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్ రావు వాహనాలపై దాడికి దిగటం వారి అసహనానికి నిదర్శనమన్నారు. దాడి గురించి తెలిసిన వెంటనే హరీశ్ రావు, జగదీష్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 99 | ₹ 121 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 175 | ₹ 200 |

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఉదారత

వరద బాధితులకు విరాళంగా రూ. 100 కోట్లు ప్రకటించిన జేఏసీ

సాయానికి ముందుకొస్తున్న సినీ ప్రముఖులు


2


2

### యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

ముందస్తు చర్యల వల్ల మూడు వేల మందిని రక్షించాం

రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలు

వరద ప్రాంతాలల్లో ఆహారం, తాగునీరుకు ఏలోటు రావద్దు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

### నీటమునిగిన పాలమూరు-రంగారెడ్డి పంప్ హౌస్

34 కి.మీ. మేర అండర్ టన్నెల్‌లోకి చేరిన నీరు

అధునాతన యంత్ర సామగ్రి మునగడంతో భారీగా నష్టం



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** నాగర్ కర్నూల్ జిల్లా భూత్పూర్ మండల పరిధిలోని కరివెన వద్ద గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన వెంకటాద్రి పంప్ హౌస్ భారీ వర్షాల కారణంగా నీట మునిగింది.దాదాపు 34 కిలో మీటర్ల మేర అండర్ టన్నెల్‌లోకి వరద నీరు మిగతా2లో...

విశ్వంభర V3 NEWS

# యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

**విశ్వంభర, పాలేరు:** కష్ట కాలంలో ఉన్న ప్రజలను కాపాడుకునేందుకు వరద ప్రభావిత ప్రాంతాలల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలు సహాయక చర్యలపై ఒకవైపు తన నియోజక వర్గం పాలేరులో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తూనే మరోవైపు రాష్ట్రంలోని వివిధజిల్లాల్లో పరిస్థితులను మంగళవారం నాడు ఆయా జిల్లా కలెక్టర్లతో టెలిఫోన్ లో సమీక్షించారు. పాలేరు నియోజక వర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలయపాలెం మండలాలల్లో పర్యటించారు. గంట గంటకు హైదరాబాద్ లోని విపత్తుల నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడుతూ అప్రమత్తం చేస్తూ వారికి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలల్లో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు కొనసాగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విపత్తుల నిర్వహణ విభాగంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు వస్తున్న ఫిర్యాదులు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగితెలుసుకున్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని పూర్తి వివరాలను జిల్లాల నుంచి తెప్పించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 117 గ్రామాలలో 67 వేల మంది భారీ వర్షాలు, వరదల వల్ల ప్రభావితమయ్యారని, ఇందులో ఒక ఖమ్మం జిల్లాలోనే 49 వేల మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 10,538 మందిని తరలించడం జరిగిందని తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలవల్ల 3039 మందిని రక్షించుకోగలిగామని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటి వరకు 44 ఇండ్లు పూర్తిగా దెబ్బతినగా 600 ఇండ్లవరకు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అయితే ఇండ్లు పూర్తిగా కోల్పోయిన వారికి కొత్తగా మంజూరుచేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు మరమ్మతులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 51 బ్రిడ్జిలు, 249 కల్వర్ట్స్, 166 ట్యాంక్ లు దెబ్బతిన్నాయని, 13,342 జీవాలు మృతి చెందాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలల్లో ఆహారం త్రాగునీరుకు ఏలోటు లేకుండా అందించాలని ఆదేశించారు. వరద బాధితులు ఎదురు చూడవలసిన పరిస్థితులు కల్పించకుండా సమహాయానికి ఆహారాన్ని అందించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో అసలైన సవాలు ఇప్పుడు ఎదురవుతుందని మానవీయ కోణంలో సహాయ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, పసిపిల్లలు, దివ్యాంగుల విషయములో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరికొన్ని రోజులు ఇదేవిధంగా అప్రమత్తంగా ఉండాలని, నష్ట పోయిన వారందరిని ఆదుకొంటూ కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ మళ్లీ సాధారణ జీవితం గడిపేలా శరవేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గడంతో వరదలు తగ్గుముఖం పట్టి బురదమయమైన ప్రాంతాలల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఖమ్మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ

**విశ్వంభర, ఖమ్మం:** వరద బాధితులను పరామర్శించే క్రమంలో భారాస, కాంగ్రెస్ శ్రేణు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఖమ్మం నగరంలోని బొ-క్కలగడ్డలో వరద బాధితులను పరామర్శించేందుకు మంగళవారం భారాస నేతలు వెళ్లారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు అక్కడే ఉండటంతో ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేసుకున్నారు. అనంతరం రాళ్లు రువ్వుకున్నారు. రాళ్ల దాడిలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కారు ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ వాహనాలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్ల దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు.

**బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం: హరీశ్‌రావు**

వరద బాధితులను ఆదుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీష్‌రా-వు ధ్వజమెత్తారు. కేంద్రం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి.. బడ్జెట్‌లో సున్నా, వరద సాయంలోనూ సున్నా'' అంటూ హరీశ్‌రావు మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్తే, ప్రధానిని నిలదీద్దామని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర, కేంద్ర నిర్లక్ష్యానికి మహబూబాబాద్, ఖమ్మం ప్రజలు బలైపోయారు. సాగర్ కెనాల్ కొట్టుకుపోవడం వల్ల వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆయన మండిపడ్డారు.

# తెలంగాణలో విద్యా కమిషన్ ఏర్పాటు

**విశ్వంభర, హైదరాబాద్:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుప-రచాలన్న లక్ష్యంతో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రీప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీకి ఈ కమిషన్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కమిషన్‌లో ఒక ఛైర్మన్, ముగ్గురు సభ్యులు ఉండనున్నట్టు తెలిపింది. అయితే.. కమిషన్ ఛైర్మన్, సభ్యు-లను ప్రభుత్వం త్వరలోనే నియమించనుంది. ఈ కమిషన్‌లో నియమితులైన.. ఛైర్మన్, సభ్యులు రెండేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు.విద్యావ్యవ-స్థలో విప్లవాత్మక మార్పులతో పాటు.. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలతో పాటు విశ్వ విద్యాలయాల వరకు నాణ్యమైన విద్య బోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే చాలా సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రతిష్ఠా-త్మకంగా విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అయితే.. మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ విద్యా కమిషన్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేస్తోంది.

**సర్కార్ పెట్టుకున్న విద్యా కమిషన్ లక్ష్యాలు..**

మారుతున్న విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని విద్యారంగం-లో విధాన రూపకల్పనపై తెలంగాణ ప్రభుత్వానికి సలహా ఇవ్వడం, థింక్ ట్యాంక్‌గా పనిచేయడం. పైలట్ అధ్యయనాలు చేయడం, పాలసీ నోట్‌లను అభివృద్ధి చేయడం, సంప్రదింపులు చేయడం, మార్గదర్శకాలు, నియమాలు, సులభతరం చేయడం లాంటి అంశాలపై అధ్యయనం చేసి కమిషన్ సిఫార్సు చేయనుంది. నాణ్యమైన ఉన్నత విద్య, ఉన్నత విద్యా సంస్థలతో అప్రెంటి-స్‌షిప్, ఉపాధి నైపుణ్యాలను ఏకీకృతం చేయడం, పాఠశాలల్లో నాణ్యమైన విద్య విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై దృష్టి , ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు పునాది నైపుణ్యాలు వంటి అంశాలపై పరిశీలన చేయనుంది. విద్యార్థులను మంచి, బాధ్యతాయుతమైన ప్రపంచ పౌరులుగా తయారు చేసేందుకు కావాల్సిన విద్యపై సిఫార్సులు చేయడం వంటి అంశాలపై దృష్టి సారించనుంది.



# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మంలో మంత్రి పొంగులేటి నివాసంలో మంగళవారం విలేకరులతో ఇష్టాగోష్టిలో, మహబూబాబాద్ జిల్లా సమీక్షలో ఈ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆకేరు వాగు పొంగడంతో కారు కొట్టుకుపోయి యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్వినీ, ఆమె తండ్రి మోతీలాల్ మృతిచెందిన విషయం విదితమే. మంగళవారం ఉదయం ఖమ్మం నుంచి నేరుగా సింగరేణి మండలం గంగారాం తండాలోని అశ్వినీ ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేరుకున్నారు. అశ్వినీ, మోతీలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశ్వినీ తల్లి నేజీ, ఆమె కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించి ఓదార్చారు. అశ్వినీ అన్న అశోక్‌కు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.



**ఆకేరు ప్రవాహంపై శాస్త్రీయ సర్వే చేపడతాం...**

ఆకేరు వాగు ప్రవాహంపై శాస్త్రీయ సర్వే చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆకేరు వాగు పొంగడంతో ప్రతి సారి తాము ముంపు బారిన పడుతున్నామని సీతారాం తండా వాసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. గంగారాం తండాలో అశ్వినీ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబాబాద్ జిల్లాలో ఆకేరు వాగు పొంగి కల్వర్టు, రహదారి తెగిపోయిన ప్రాంతానికి చేరుకొని దానిని పరిశీలించారు. అక్కడే అశ్వినీ, ఆమె తండ్రి మోతీలాల్ పయనిస్తున్న కారు ఆకేరు వాగు ప్రవాహానికి కొట్టుకుపోయి వారు ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతాన్ని, ఆకేరు వాగును, కల్వర్టు కొట్టుకుపోయిన తీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. వాగు ప్రవాహ ఉద్ధృతి ఎలా ఉంటుంది.. గతంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయా అని ముఖ్యమంత్రి స్థానికులను ప్రశ్నించారు. ప్రతిసారి వాగు పొంగడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, రహదారి గతంలోనూ తెగిందని స్థానికుడు జర్పుల లక్ష్మణ్ ముఖ్యమంత్రికి తెలిపారు. అక్కడి నుంచి ఆకేరు పొంగి ముంపు బారిన పడిన సీతారాం తండాకు ముఖ్యమంత్రి చేరుకున్నారు. తండాలో ఇళ్లు మునిగిన వారిని ఓదార్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము తీవ్రంగా నష్టపోయామని, ఆకేరు వాగు పొంగిన ప్రతిసారి తమ తండాతో సమీపంలోని మరో రెండు తండాలకు నిద్ర ఉండడం లేదని, తమను రక్షించాలని ముఖ్యమంత్రిని తండా వాసులు కోరారు.. తండా వాసులను ఓదార్చిన అనంతరం ముఖ్యమంత్రి వారిని ఉద్దేశించి మాట్లాడారు. మూడు తండాలను కలిపి ఒకే చోట మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తామని.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆకేరు వాగు పొంగి ఇళ్లలోని పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, సర్టిఫికెట్స్ తడిచిపోయినందున ఒకే ఎఫ్ ఐ ఆర్ దాఖలు చేసి అందరికీ నూతన కార్డులు, సర్టిఫికెట్స్, పాసు పుస్తకాలు మంజూరయ్యేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆకేరు ప్రవాహంపై శాస్త్రీయంగా అంచనా వేసి నూతన వంతెన నిర్మిస్తామని, నీటిని సమీపంలోని చెరువులు, కుంటలకు మళ్లించే ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆకేరు వాగు వరదతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

**అప్రమత్తతతో ముప్పు తగ్గించగలిగాం...**

గతంలో ఎన్నడూ లేనంతగా మహబూబాబాద్ జిల్లాలో వర్షపాతం నమోదైనా ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించగలిగామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న పంట, ఆస్తి నష్టాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి తిలకించారు. అనంతరం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తాము ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఊహించని వర్షాలు, వరదలతో మహబూబాబాద్ జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన వారు ఇద్దరు, మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు ఇద్దరని ముఖ్యమంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.... ఎకరాకు రూ.పది వేల చొప్పున పంట నష్ట పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో ముంపు బారిన పడిన 680 మందిని సహాయక శిబిరాలకు తరలించామని సీఎం చెప్పారు. సీతారాం తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలిచిన ఎస్సై నగేష్ కి అభినందనలు తెలిపారు. జిల్లాలో విపత్తు సమయంలో సత్వరం స్పందించిన పోలీసు, రెవెన్యూ సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. జిల్లాల్లో విపత్తుల సమయంలో ఏం జరిగింది.. ఆ సమస్యను ఎలా అధిగమించారు... ఎలా సహాయక చర్యలు తీసుకున్నారనే దానిపై బ్లూబుక్ రూపొందించుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు. ఆ బ్లూ బుక్ భవిష్యత్‌లో వచ్చే అధికారులకు విపత్తుల సమయంలో కరదీపికగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు.

**పువ్వాడ అజయ్ ఆక్రమణల తొలగింపునకు హరీశ్ సహకరిస్తారా..?**

ఖమ్మం ముంపు బారిన పడడానికి మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణలే కారణమని తనకు ఫిర్యాదులు అందాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి ఇష్టారీతిగా కాలువలు ఆక్రమించారని, దాంతో ఖమ్మం ముంపు బారిన పడిందని తాను పరామర్శిస్తున్నప్పుడు స్థానికులు చెప్పారన్నారు. పదేళ్ల కాలం నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీష్ రావు ఈ ఆక్రమణలపై ఏమంటారని, వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లు హరీష్ రావు ఇప్పుడు బాధితుల పరామర్శకు బయలుదేరారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణల తొలగింపునకు హరీష్ రావు చిత్తశుద్ధితో సహకరిస్తారా..? దగ్గర ఉండి ఆక్రమణలు తొలగింపజేస్తారా అని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. ఖమ్మంలో పువ్వాడ ఆక్రమణలకు సంబంధించి వాస్తవాలు వెలికితీయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు... తాము అధికారంలోకి వచ్చాక తొలిసారిగా వేసిన టెండర్ ఖమ్మం మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుకేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం అంతకు మించిన ఎత్తులో నీరు వచ్చినందున.. ఆ ఎత్తు పెంపు సమీక్షిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

**రెండింటిని పోల్చి చూసుకోండి...**

తెలంగాణలోని ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలు కవల పిల్లల వంటివని, కృష్ణాతో పోల్చితే ఖమ్మంలోనే ఎక్కువ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మరింత నష్టం వాటిల్లకుండా చూసుకోగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు.... తాను కంటిపై కునుకు లేకుండా పర్యవేక్షణ చేశానని సీఎం చెప్పారు... ప్రకృతి విపత్తుల సమయంలో త్వరగా చేరుకోవడానికి వీలుగా హెలీకాప్టర్లను పంపుతారని, ఖమ్మానికి విజయవాడ దగ్గర ఉన్నందునే అక్కడకు హెలీకాఫ్టర్లు చేరుకున్నాయని.. ఈ సమయంలో ప్రాంతం, రాజధాని వంటివి చూసుకోకూడదని ముఖ్యమంత్రి అన్నారు. భారీగా నష్టం వాటిల్లినందునే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్రంలో పర్యటించాలని కోరామని ముఖ్యమంత్రి తెలిపారు.

**ఏనాడైనా బాధితులను పరామర్శించారా..?**

పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఏనాడైనా వరద, ప్రమాద బాధితులను పరామర్శించారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వరద బాధితుల వద్దకు ఏనాడూ కేసీఆర్ వెళ్లలేదని, సొంత నియోజవకర్గం మాసాయిపేటలో రైలు ప్రమాదంతో చిన్నారులు చనిపోయినా, హైదరాబాద్ ఓఆర్ఆర్ లో పశు వైద్యురాలు అత్యాచారానికి, హత్యకు గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించలేదని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నేతలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని కేసీఆర్ ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అమెరికాలో ఎంజాయ్ చేస్తున్న కేటీఆర్ క్షేత్రంలో ఉండి సహాయక చర్యలు చేపడుతున్న మంత్రులపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో దోచుకున్న రూ.లక్ష కోట్ల నిధుల్లో రూ.వెయ్యి కోట్లో... రూ. రెండు వేల కోట్లో సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వాలని కేసీఆర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సూచించారు.

**సీఎంఆర్ఎఫ్ కు విరాళాలు...**

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు గానూ ముఖ్యమంత్రి ఉపశమన నిధి (సీఎంఆర్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఒక రోజు మూల వేతనం రూ.135 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెక్ రూపంలో అందజేశారు. వారికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఉదారత





**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు ఉదారత చాటుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ప్రజలు అతలాకుతలమైన సంగతి తెలిసిందే. తినడానికి తిండి లేక.. తాగడానికి నీళ్లు లేక పలు ప్రాంతాల ప్రజలు వరదలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇది చూసి చలించిపోయిన ఉద్యోగులు పెద్ద మనసు చాటుకున్నారు. వరద బాధితుల కోసం ఒకరోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ మంగళవారం ఉదయం కీలక ప్రకటన చేసింది. జేఏసీ ప్రకటించిన మొత్తం విరాళం రూ.100 కోట్లు ఉంటుంది కాగా.. విరాళం ప్రకటించిన వారిలో ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షన్‌దారులు ఉన్నారు. వీరంతా ఒకరోజు తమ జీతాన్ని . సెప్టెంబర్ నెల జీతం నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అతిపెద్ద విపత్తుగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ భావించిందని లచ్చిరెడ్డి మీడియాకు వెల్లడించారు. ఉద్యోగుల ఉదారతకు సామాన్య ప్రజలు, వరద బాధితులు, పలు రంగాల ప్రముఖులు హ్యాట్సాప్ చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 10వేలు ఇవ్వాల్సిందిగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చిట్ చాట్‌లో భాగంగా ఈ ప్రకటన చేశారు.

## తెలుగు రాష్టాలకు ఎన్టీఆర్, బాలకృష్ణ భారీ విరాళం

**ఇదిలా ఉంటే.. తెలుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు ఎంతో మంది సామాన్య ప్రజలు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం తమ తమవంతుగా సాయం చేస్తున్నప్పటికీ.. సాధ్యం కాని పరిస్థితి. ఈ క్రమంలో సినీ, రాజకీయ.. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు విరాళాలు ప్రకటిస్తూ 'మేము సైతం' అంటూ ముందుకొస్తున్నారు. టాలీవుడ్ యంగ్ హీరో జూనియర్ ఎన్టీఆర్.. తెలుగు రాష్ట్రాలకు కోటి రూపాయిలు విరాళం ఇచ్చారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ప్రకటించారు. దమూరి బాలకృష్ణ సైతం భారీ విరాళాన్ని ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.50లక్షల చొప్పున విరాళం ప్రకటించారు. వైజయంతి మూవీస్ అధినేత అశ్వనీదత్ 25 లక్షల రూపాయిలకు ఏపీకి విరాళంగా ప్రకటించారు. వరద భాదితుల సహాయార్థం ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విశ్వక్ సేన్ రూ. 5 లక్షల విరాళంగా ప్రకటించారు.**

**తెలుగు ప్రజలు కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా...ఎన్‌టీఆర్**

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరుగుతున్న వరద భీభత్సం నన్ను ఎంతగానో కలచివేసింది. అతి త్వరగా ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు కోలుకోవాలని నేను ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను. వరద విపత్తు నుంచి ఉపశమనం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకొనే చర్యలకు సహాయపడాలని నా వంతుగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల ముఖ్యమంత్రి సహాయ నిధికి చెరొక 50 లక్షల రూపాయిలు విరాళంగా ఇస్తున్నాను' అని ఎక్స్‌లో ఎన్టీఆర్ ప్రకటించారు.

**ఇది నా బాధ్యత...బాలకృష్ణ**

"50 ఏళ్ళ క్రితం మా నాన్నగారు నా నుదుటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది, 50 ఏళ్ల నుంచి నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది-వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగుజాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీకోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం తెలుగు నేలను వరద ముంచెత్తుతోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో బాధాతప్త హృదయంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు., తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు నా బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను అని ప్రకటించారు. రెండు రాష్ట్రాలలో మళ్ళీ అతి త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను." అని బాలకృష్ణ తెలిపారు.

## నీటమునిగిన పాలమూరు-రంగా రెడ్డి

# పంప్ హౌస్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినట్లు తెలుస్తోంది. పంప్‌హౌస్ లోపలే మిషిన్లు ఉండటంతో అధికారులు నీటిని బయటకు పంపించే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన మోటార్లు, మిషనరీలు వరదలో మునిగిపోవ-డంతో భారీగా నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదల వల్ల సుమారు రూ.5వేల కోట్లకు పైగానే నష్టం వాటిల్లి ఉంటుందని తొలుత ప్రభుత్వం భావించినా ఇప్పుడు అది కాస్త రెండింతలు అయినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణకు ఈ వర్షాలు మరింత నష్టం చేకూర్చాయని ప్రభుత్వ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

# బీఆరెస్ నేతల వాహనాలపై దాడి కాంగ్రెస్ అసహనానికి నిదర్శనం



(మొదటి పేజీ తరువాయి)

సబితా ఇంద్రారెడ్డి లకు కేటీఆర్ ఫోన్ చేశారు. సంఘటన ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచేందుకు ఖమ్మం వెళ్లిన పార్టీ నేతలను అభినందించారు. ప్రజలకు సాయం చేయటం చేతగాక...సాయం చేస్తున్న వాళ్లను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ వాళ్లు ఈ దాడికి తెగబడ్డారని కేటీఆర్ మండిపడ్డారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రజలను నిర్లక్ష్యం చేస్తే వారికి అండగా ఉండటమే తప్పా అని ప్రశ్నించారు. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై దాడులకు తెగబడటం సిగ్గుచేటని ఘాటుగా విమర్శించారు. ఈ దాడికి ముఖ్యమంత్రి సహా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. బీఆర్ఎస్ కు ఇలాంటి దాడులు కొత్త కాదని...గతంలో తెలంగాణ కోసం ఇలాంటి ఎన్నో దాడులను ఎదుర్కొన్నామని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ గుండాలు ఎన్ని దాడులు చేసిన సరే ప్రజలకు అండగా ఉండే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త సంతోష్ రెడ్డికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భారీ వర్షాలు, వరదలతో ప్రజలు సమమతమవుతుంటే ప్రజలను గాలికి వదిలేసి ప్రతిపక్షాల మీద దాడులు చేస్తుండటం కాంగ్రెస్ చేతగాని తనమన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని సరైన సమయంలో ఈ కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా బుద్ధి చెబుతారని అన్నారు.

# జీహెచ్ఎంసీ విస్తరణలో తొలిఅడుగు

- ఓఆర్ఆర్ లోపలి పంచాయతీలపై ఆర్డినెన్స్ జారీ చేసిన సర్కారు
- మున్సిపాల్టీల్లో గ్రామాల విలీనం



**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ విస్తీర్ణాన్ని పెంచే దిశగా సర్కారు తొలి అడుగువేసింది. ఔటర్ రింగు రోడ్డు లోపలున్న రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల్లోని పలు గ్రామాలను మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆర్డినెన్స్ ను జారీ చేసింది. పెద్ద అంబర్ పేట మున్సిపాల్టీలోకి సమీపంలోనున్న బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతి పేట గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. దీంతో పాటు శంషాబాద్ మున్సిపాల్టీ పరిధిలోకి బహదూర్ గూడ, పెద్ద గోల్కొండ, చిన్న గోల్కొండ, హమీదుల్లా నగర్, రషీద్ గూడ, ఘన్సీ మియా గూడ గ్రమ పంచాయతీలను విలీనం చేస్తున్నట్లు అర్డినెన్స్ లో సర్కారు పేర్కొంది. అలాగే మిర్జాగూడ గ్రామ పంచాయతీని నార్సింగ్ మున్సిపాల్టీలో, తుక్కుగూడ మున్సిపాల్టీలో హర్షగూడ గ్రామ పంచాయతీలను విలీనం చేస్తున్నట్లు సర్కారు ఆర్డినెన్స్ లో స్పష్టం చేసింది. మేడ్చల్ మున్సిపాల్టీలోకి పూడుర్, రైల్ పూర్ గ్రామ పంచాయతీలను విలీనం చేస్తున్నట్లు సర్కారు వెల్లడించింది. వీటితో పాటు దమ్మాయిగూడ మున్సిపాల్టీలోకి కీసర, యాద్ గర్ పల్లి, అంకిరెడ్డి పల్లి, చీర్యాల్, నర్సంపల్లి, తిమ్మాయిపల్లె గ్రామ పంచాయతీలను, అలాగే భోగారం, గోడుమకుంట, కరీంగూడ, రాంపల్లి, దాయరా గ్రామ పంచాయతీలను నాగారం మున్సిపాల్టీలోకి విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. పోచారం మున్సిపాల్టీలోకి సమీపంలో ఉన్న వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచవాని సింగారం. చౌదరిగూడ లను, ఘట్కేసర్ మున్సిపాల్టీలోకి అంకుశాపుర్, ఔషాపూర్, మాధారం, ఎదులాబాద్, ఘణపూర్, మర్పల్లిగూడ లను విలీనం చేస్తున్న ఆర్డినెన్స్ లో సర్కారు వెల్లడించింది. గుండ్ల పోచంపల్లి మున్సిపాల్టీలోకి మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలను విలీనం చేస్తున్నట్లు పేర్కొంది. తూంకుంట మున్సిపాల్టీలోకి భౌంరాస్ పేట, శామీర్ పేట, బాబాగూడ గ్రామాలను, అలాగే తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోకి కర్దనూర్, ముత్తంగి, పోచారం, పాటి, గణపూర్ గ్రామాలను విలీనం చేస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి. అమీన్ పూర్ మున్సిపాల్టీ పరిధిలోకి ఐలాపూర్, ఐలాపూర్ తాండా, పటేల్ గూడ, దయారా, కిష్టరెడ్డి పేట, సుల్తాన్ పూర్ లను విలీనం చేస్తున్నట్లు ఆర్డినెన్స్ పేర్కొంది.

## ఈ విపత్తును ఎదుర్కోవాలి!!

*వరద నీరు కన్నీరుగా మారింది!*
*నెత్తి మీద నీలి పొర కాలి కింద ధూళి పొరను తాకింది!!*
*ఆకాశం మరచిపోయింది భూమి తడిచిపోయింది!*
*నదులు ఉగ్రరూపం దాల్చి కొట్టుమిట్టాడుతున్నాయి!!*
*మా ఇళ్లు, మన జీవితాలు నీటిలో కొట్టుకుపోతు-న్నాయి!*
*ఆంధ్రా, తెలంగాణ, ఏడుస్తున్నాయి!!*
*ప్రజలు నిరాశలో మునిగిపోతున్నారు!*
*పంటలు నశించిపోయాయి, జీవనం స్తంభించిపో-యింది!!*
*ఆకలి, దాహం, భయం మమ్మల్ని వెంటాడుతున్నాయి!*
*ఎక్కడ చూసినా విషాదం, విలియతాండవం చేస్తుంది!!*
*మనసులు బీభత్సంతో కొట్టుమిట్టాడుతున్నాయి!*
*కొండలుకొట్టుకుపోతున్నాయి*
*నదులుఉప్పొంగుతున్నాయి!!*
*ప్రకృతి ప్రళయం ముందు మనం నిస్సహాయులం!*
*ఎవరు మమ్మల్ని రక్షిస్తారు?*
*ఎవరు మమ్మల్ని ఆదుకుంటారు?*
*దేవుళ్ళు మన ప్రార్ధనలు వినరు!*
*ప్రభుత్వాలు మనల్ని పట్టించుకోవు!!*
*మనం మనమే కలిసి నిలబడాలి!*
*ఈ విపత్తును ఎదుర్కోవాలి!!*
*సహాయం చేయండి! అందరూ కలిసి పని చేద్దాం!!*
*ప్రకృతిని కాపాడుకుందాం! అడవులను పెంచుకుందాం!!*
*నీటిని కాలుష్యం కాకుండా కాపాడుకుందాం! పర్యా-వరణాన్ని పరిరక్షించుకుందాం!!*
*మన భవిష్యత్తు కోసం! మన పిల్లల కోసం!!*
*ఈ భూమిని పచ్చని మొక్కలతో!*
*స్వచ్ఛన్ని నీటితో అందంగా మార్చుకుందాం!!*
*ఈ ప్రకృతి విపత్తును అధిగమించి!*
*మళ్ళీ కొత్తగా ప్రారంభిద్దాం!!*
*మన ప్రాణాలు!మన ఆస్తిని కాపాడుకుందాం!!*
*మన రాష్ట్రాలను మళ్ళీ పచ్చగా! అందంగా తీర్చిదిద్దాం!!*
*అందరూ కలిసి పనిచేద్దాం !*
*ప్రకృతిని పరిరక్షించుకుందాం!!*

**- పూసపాటి వేదాద్రి**
**కవి సాహితీ విశ్లేషకులు**
**9912197694**

## వారం రోజుల్లో గాంధీలో ఐవీఎఫ్ సేవలు

### మంత్రి దామోదర రాజనరసింహ వెల్లడి



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో త్వరలో ఇక్కడ ఐ వీ ఎఫ్ సెంటర్‌ను ప్రారంభిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ వెల్లడించారు. మంగళవారం గాంధీ ఆసుపత్రిలో అయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి యాజమాన్యంతో భేటీ నిర్వహించారు. కారిడార్లలో రోగుల సహాయకులు కింద కూర్చోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల సహాయకులు కూర్చోవడానికి సీట్లు ఏర్పాటు చేయలని ఆదేశించారు.

**ఎనిమిదో అంతస్తులో ఆపరేషన్ థియేటర్**

గాంధీ ఆసుపత్రిలో సిబ్బంది, పడకల అందుబాటుపై మంత్రి సమీక్ష నిర్వహించిన ఆయన వారంలో గాంధీలో ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. 8వ అంతస్తులో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని డాక్టర్లు సూచించినట్లు తెలిపారు. వీటన్నింటికి ప్రభుత్వం రాబోయే కాలంలో సానుకూలంగా స్పందిస్తుందని ఆయన అన్నారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజకుమారి పాల్గొన్నారు.

### చేపల వేటకు వెళ్లి వాగులో

## చిక్కుకున్న పదిమంది చెంచులు

### సురక్షితంగా కాపాడిన పోలీసులు

**విశ్వంభర, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం సిద్దాపూ ర్ శివారు దుందుబి వాగులో చేపల వేటకు వెళ్లిన 10 మంది చెంచులు చిక్కుకున్నారు. స్థానికుల సమాచారంతో స్పందించిన అచ్చంపేట, దేవరకొండ పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రెండు రోజులుగా ఏమీ తినకపోవడంతో ఆహారం అందించి ఆస్పత్రికి తీసుకెళ్లారు.నల్గొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లికి చెందిన జలల్ గురువయ్య, ఆయన భార్య నిరంజనమ్మ, కుమారులు బయ్యన్న, సత్యయ్య, చినపాపయ్య, చిన్న పాపయ్య భార్య యాదమ్మ, వారి ఐదు, మూడేళ్ల కూతుళ్లు అంజలి, అఖిల, కుమారుడు శివ మరో ఏడాది లోపు చిన్నారి వాగులో చిక్కుకున్న వారిలో ఉన్నారు. మూడు రోజుల కిందట చేపల వేట కోసం వెళ్లిన ఆ కుటుంబం, వాగు ఉధ్ధృతంగా ప్రవహించడం తో వాగు మధ్యలోని గడ్డకు చేరుకున్నారు. కానీ రెండు రోజులుగా వాగు ఉధ్ధృతి తగ్గకపోవడంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. స్థానికులకు సమాచారం చేరవేయగా, అచ్చంపేట పోలీసులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన పోలీసులు అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవిందర్, ఎస్సై రాముతో పాటు డిండి ఎస్సై రాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు వాగులో చిక్కుకున్న వారిని రక్షించడానికి సోమశిల నుంచి గజ ఈత గాళ్లను రప్పించారు. డ్రోన్ల సాయంతో బాధితులకు ఆహారం అందించారు. చీకటి కావడంతో వారిని వాగు మధ్యలోంచి తీసుకురావడం కష్టంగా మారింది. మంగళవారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది సాయంతో తాళ్లు కట్టి వరదల్లో చిక్కుకున్న 10 మందిని ఒడ్డుకు చేర్చారు. రెండు మూడు రోజులుగా ఆహారం లేకపోవడంతో వారికి ఆహారం అందించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రాథమిక చికిత్స అందించి వైద్యం కోసం బాధితుల్ని అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వరదల్లో చిక్కుకున్న వారిని శ్రమించి కాపాడిన పోలీసులలపై ప్రశంసలు వెల్లువెత్తాయి.

## మరో 28 రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా మరికొన్ని రైళ్లు రద్దయ్యాయి. 28 రైళ్లను రద్దు చేయగా, కొన్నింటిని దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ మేరకు సీపీఆర్వో శ్రీధర్ ఓ ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా సోమవారం వరకు 496 రైళ్లు రద్దు కాగా.. 152 సర్వీసులను దారి మళ్లించారు. తాజాగా 28 రైళ్లు రద్దు చేశారు. రద్దయిన వాటిలో సికింద్రాబాద్‌విశాఖ వందేభారత్, విశాఖ సికింద్రాబాద్ వందేభారత్, నాందేడ్ సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ హౌరా మెయిల్, చెన్నై సెంట్రల్ విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, విశాఖ నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి.

**రద్దైన రైళ్లు**

20812 నాందేడ్ టు విశాఖపట్నం 04.09.24
17208 మచిలీపట్నం టు షిర్డీ సాయినగర్ 03.09.24
17207 షిర్డీ సాయినగర్ టు మచిలీపట్నం 04.09.24
18046 హైదరాబాద్ టు షాలిమార్ 04.09.24
17405 తిరుపతి టు ఆదిలాబాద్ 03.09.24
12787 నరసాపూర్ టు నాగర్ సోల్ 03.09.24
12788 నాగర్ సోల్ టు నరసాపూర్ 04.09.24

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణించే మరో 10 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కొన్ని రైళ్లను ఒక రోజు, మరికొన్నింటిని మూడు రోజుల పాటు రద్దు చేసినట్లు తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో రద్దైన రైళ్ల వివరాలు ప్రత్యేక బోర్డులపై రైల్వే స్టేషన్లలో ప్రదర్శిస్తున్నారు. రాజమండ్రి, సామర్లకోట, తుని, పిఠాపురం మీదుగా వెళ్లే విశాఖపట్నం గుంటూరు రైలును(17240) ఈ నెల 6వ తేదీ వరకు నిలిపివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## నేడూ భారీ వర్షా లు.. ఎల్లో హెచ్చరిక జారీ

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. మధ్యవిదర్భ పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్న ప్రస్ఫుటమైన అల్పపీడన ప్రాంతం, ప్రస్తుతం అల్పపీడన ప్రాంతంగా బలహీన పడి పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవరించి ఉందని వాతావరణ శాఖ సంచాలకులు వివరించారు. కోస్తాంధ్ర, యానాం పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టం నుంచి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని తెలిపారు.













# సర్వ శుభప్రదం భాద్రపదం

**దేవతలు, పితృదేవతలకు సమానంగా పూజలు చేసే మాసం**

**శుక్లపక్షంలో దేవతా పూజలకు ఉత్కృష్టమైన కాలం**

**కృష్ణ పక్షం పితృదేవతల ఆరాధనలకు అత్యంత ప్రీతికరం**

మానవ జీవితంలోని ఒడిదుడుకులను తొలగించి సకల శుభాలను అందించే మాసంగా భాద్రపదమాసం శాస్త్ర ప్రసిద్ధికెక్కింది. భాద్రపద మాసం అనగానే అందరికీ గుర్తొచ్చేది వినాయకచవితి పండగ. అదే సమయంలో- వరాహజయంతి, వామన జయంతి, రుషి పంచమి, ఉండ్రాళ్ల తద్దె, పితృదేవతలకు తర్పణాలను వదిలే మహాలయ పక్షం.. ఈ నెలలోనే వస్తాయి. ఇది ముగిసిన వెంటనే దసరా సందడి ఆరంభమౌతుంది. హిందూ క్యాలెండర్‌లో భాద్రపదం ఆరవ మాసం. వర్ష రుతువులో రెండవది. దేవతలు, పితృదేవతలకు సమానంగా పూజలు చేయడం ఈ మాసం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

**శుక్లపక్షంలో దేవతా పూజలకు ఉత్కృష్టమైన కాలం...**

తొలి అర్ధభాగం అంటే శుక్లపక్షంలో దేవతా పూజలకు ఉత్కృష్టమైన కాలంగా భావిస్తారు. శుక్లపక్ష కాలంలో ఉండ్రాళ్ల తద్దె, గౌరీ పూజ, వినాయక చవితి, శుక్ల చవితి, శుక్ల ఏకాదశి, శుక్ల ద్వాదశి, శుక్ల చతుర్ధశి, కృష్ణ పక్ష ఏకాదశి వంటి పండగలు జరుపుకొంటారు. ఇందులో శుక్ల ఏకాదశిని పరివర్తన ఏకాదశిగా, ద్వాదశిని వామన జయంతిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మాసం లో ఒంటి పూట భోజనం చేస్తే ధన సమృద్ధి ఆరోగ్యం ప్రాప్తిస్తాయి. ఉప్పు మరియు బెల్లం దానాలు కూడా ఈ మాసం లో విశేష ఫలితాన్నిస్తాయి.

- భాద్రపద శుక్ల తదియ రోజున కొన్ని ప్రదేశాలలో స్త్రీలు హరితాళిక వ్రతం ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించి, ఉపవాసం జాగరణ చేస్తారు. ఈ వ్రతాన్ని భక్తి శ్రద్దలతో ఆచరిస్తే కష్టాలు తొలగి, అష్టైశ్వర్యాలతో తులతూగుతారు.
- భాద్రపద శుద్ధ పంచమి నాడు ఋషి పంచమి జరుపుకొంటారు. ఇది కేవలం ఆడవారికి సంబంధించిన ప్రాయోశ్చితాత్మకమైన వ్రతం. ఈ వ్రతం చేయడం వలన స్త్రీలు ఋతుశ్రావ సమయం లో చేసిన పాపాలన్నీ తొలగి పుణ్య ఫలితం లభిస్తుంది అని భవిష్యపురాణం లో చెప్పబడింది. ఈ వ్రతం లో ముఖ్యంగా ఆచరించవలసినది, బ్రహ్మాణుడికి అరటి పళ్ళు, నెయ్యి, పంచదార, దక్షిణ ఇవ్వాలి. ఒంటి పూట భోజనం చేయాలి. అంతే గాక ఆ భోజనం ధాన్యం, పాలు, పెరుగు, ఉప్పు, పంచాదారలతో తయారుచేయకుండా ఉండాలి. పళ్ళని స్వీకరించడం శ్రేయస్కరం.బౌద్ధ జయంతి ని కూడా ఈ రోజునే జరుపుకొంటారు. బుద్ధుని భోధనలు మానవుని ధర్మబద్ధమైన , పవిత్రమైన జీవనానికి వెలుగు బాట వేసాయి. ప్రపంచం లోని ధర్మమతస్తాపనకు బుద్ధుడు అత్యున్నత స్థానం వహించాడనే విషయంలో ఏమాత్రం భేదాభిప్రాయాలు లేవు.
- భాద్రపద శుద్ధ షష్ఠి – సూర్య షష్ఠి, సప్తమి కలసిన షష్ఠి సూర్యునికి ప్రీతికరం, ఈరోజున సూర్యుడిని ఆవుపాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రం తో ప్రాశనం చేస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలం కంటే ఎక్కువ ఫలం కలుగుతుందని



భాద్రపద శుద్ధ చవితి నాడు ఆది దేవుడైన వినాయక ఆవిర్భావం జరిగిన రోజు.సకల విఘ్న నివారకుడు, గౌరీ పుత్రుడు, విఘ్నేశ్వరుడు, ప్రతికల్పంలోనూ భాద్రపద శుద్ధ చతుర్ధినాడు ఆవిర్భవిస్తాడు. ఒక కల్పంలో విష్ణువే గణపతిగా పార్వతికి పుత్రుడై వచ్చినట్లుగా బ్రహ్మ వైవర్త పురాణంలో ఉంది. ఈ కల్పంలో అనగా శ్వేత వరాహకల్పంలో మాత్రం పార్వతీదేవీ శరీర నుండి ఆవిర్భవించాడు. పార్వతీ దేవీ శరీరం దివ్య శరీరం. అయినా ఆ తల్లి కావాలని పాంచభౌతిక శరీరానికి కలిగే లక్షణాలను తన శరీరానికి కల్పించుకోవడంతో, ఆమె శరీరం నుండి మట్టి పుట్టింది. అందులో నుండి గణపతి పుట్టాడు. ఎందుకో గాని కొందరు వ్యాఖ్యాతలు దానికి నలుగు పిండి నుండి పుట్టినట్లు వ్యాఖ్యానాలు వ్రాసారు. కానీ కంచి పరమాచార్యులు మాత్రం శరీరపు చెమట నుండి పుట్టిన మట్టి నుండి గణపతి జన్మించినట్లు వివరించారు. నిజానికిక్కడ పిండి ప్రసక్తి లేనేలేదు. అలాపుట్టిన పార్వతీ పుత్రుని శిరస్సును శివుడు ఖండించి, గజముఖం ప్రసాదించడంతో శ్రీ గణేశుడు గజముఖుడు అయ్యాడు. సర్వ విఘ్న నివారకుని జన్మకు కారణమైన భాద్రపదం భద్ర పదమే. గణేశుని పూజించి జనులు సకల శుభాలనూ పొందగలరని నారదపురాణంలోని 113వ అధ్యాయంలో ఉన్నది. శుక్ల చతుర్థినాడు 21 పత్రాలతో గణపతిని పూజించి, వినాయక ప్రతిమను దక్షిణతో గురువులకు దానం చేసిన వాడు ఐహికము, ఆముష్మికమూ రెండు పొందుతాడు, అని నారదపురాణంలో స్పష్టంగా వ్యాసుడు వివరించాడు.

శాస్త్రం లో చెప్పబడింది. షష్ఠి తో కూడిన సప్తమి ఉంటే కనుక సుబ్రహ్మణ్య స్వామి ని పూజిస్తే ఎటువంటి పాతకాలైన నశిస్తాయి.

- భాద్రపద శుద్ధ అష్టమి నాడు కేదారవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని సంప్రదాయ సిద్ధం గా ఆచరిస్తుంటారు. భాద్రపద శుద్ధ దశమి నాడు దశావతార వ్రతం ఆచరించడం , దేవ , ఋషి , పితరులకు తర్పణాలు చేయడం ముఖ్యమైన విధులు. భాద్రపద శుద్ధ ఏకాదశి , దీన్నే పద్మ పరివర్తన ఏకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి రోజున పాల సముద్రం లో శేషతల్పం పై శయనించిన శ్రీమహావిష్ణువు , ఈ ఏకాదశి రోజున ప్రక్కకు పొర్లి పరివర్తనం చెందుతాడు , అందుకే దీన్ని పరివర్తన ఏకాదశి అంటారు ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే కరువు కాటకాలు తొలగి పోతాయి , ముఖ్యం గా సంధ్యాసమయం లో శ్రీ మహా విష్ణువు ని పూజిస్తే మంచి ఫలితాలు కలుగుతాయి.
- భాద్రపద శుద్ధ ద్వాదశి వామన జయంతి గా చెప్పబడింది , ఈ రోజున వామనున్ని ఆరాధిస్తే అన్ని విషయాలలోనూ విజయం లభిస్తుంది. ముఖ్యంగా ఈ రోజున బ్రాహ్మణులకు పెరుగును దానం చేస్తే మంచి ఫలితాలని పొందవచ్చు.
- భాద్రపద మాసం లో శుద్ధ చతుర్దశి నాడు అనంత పద్మనాభ చతుర్దశి అంటారు. శేషతల్పసాయిగా నాభికమలం తో శ్రీమహాలక్ష్మి సమేతుడైన శ్రీమహావిష్ణువుని పూజించి , వ్రతమాచరిస్తే దారిద్ర బాధలు తొలగి ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుంది.
- భాద్రపద పూర్ణిమ రోజు ఉమామహేశ్వర





వ్రతం జరుపుకొంటారు , భక్తి శ్రద్దలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తే సుఖశాంతులతో పాటు అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయి.భాద్రపద పూర్ణిమా తిథిన మొట్టమొదటిసారి ఉమామహేశ్వరులు అర్థనారీశ్వరులయ్యారు. అందువల్ల ఈ తిథిన మునులు ఉమామహేశ్వర వ్రతం, చేసారు. అర్ధనారీశ్వర ప్రతిమను భక్తితో, షోడశోపచారాలతో, పూజించాలి. బిల్వపత్రాలతో శివపార్వతులను పూజించిన పుణ్యాత్ములు, ఆదర్శ దంపతులై సకల సుఖాలతో జీవిస్తారు. ఇటువంటి వ్రతం మరోకటి లేదనీ, ఇంతటి వ్రతాన్ని మనకందించిన భాద్రపదమాసం వంటి మాసం లేదనీ అగస్త్యుడు అన్నాడు.



- మంగళగిరి మాధవ శేషు స్వామి
వి3 న్యూస్, ఆధ్యాత్మిక వేత్త



## పితృదేవతల ఆరాధనలకు అత్యంత ప్రీతికరమైన మహాలయ పక్షం

బాద్రపద మాసంలో రెండవ అర్థభాగం మహాలయ పక్షం ఆరంభమౌతుంది. భాద్రపద పూర్ణిమ తో ఆరంభమయ్యే కృష్ణ పక్షం పితృదేవతల ఆరాధనలకు అత్యంత ప్రీతికరమైన కాలమని వేదాలు చెబుతున్నాయి. అమావాస్య వరకు గల ఈ కాలాన్ని పితృ పక్షం అంటారు. మృతులైన పితరులకు , పూర్వీకులకు తప్పనిసరిగా తర్పణలివ్వాలి. శ్రాద్ధాన్ని యధాశక్తి గా ఈ దినాలలో చేయాలి.ఈ సమయంలో ఎలాంటి శుభకార్యాలు చేయకూడదు. పితృదేవతలను ఆరాధించడానికి, వారికి పిండ ప్రదానాలు చేయడానికి, తర్పణాలను వదలడం, వారికి ఉత్తమగతులను అందించే కార్యాలకు మాత్రమే ఇది పరిమితం. పితృదేవతల పేరు మీద దాన ధర్మాలు చేయడం అత్యవసరం. బ్రాహ్మణులకు బియ్యం, నువ్వులు.. వంటి ఆహార ధాన్యాలు, గోవు, బంగారాన్ని దానంగా సమర్పించుకోవడం వల్ల సద్గతులు లభిస్తాయని పెద్దలు చెబుతుంటారు. శ్రాద్ధవిధులను భక్తి శ్రద్ధలతో నిర్వహించడం, పిండప్రదానం చేయడం వంటి కార్యాల వల్ల పితృదేవతలకు ఉత్తమగతులు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.మహాలయంలో పద్మకల్పంలో రుద్రుడు భాద్రపద బహుళ పాడ్యమి నుండి పదిహేను రోజుల పాటు లోకాలను తనలో లయం చేసుకున్నాడనీ, అందుకే ఆ కాలానికి అనగా భాద్రపద కృష్ణ ప్రతిపత్ తిథి నుండి భాద్రపద అమావాస్య వరకు ఉండే కాలాన్ని మహాలయ పక్షములు అంటారని వ్యాసుడు వివరించాడు. ఈ కాలంలో పితృ శ్రాద్ధాలు చేయాలి. ఈ శ్రాద్ధాల వల్ల పితృదేవతలు సంతృప్తులౌతారు. వంశాభివృద్ధి అవుతుంది మరియు అకాల మరణాలు ఉండవు. ముఖ్యంగా భరణీ నక్షత్రం నాడు పితృదేవతలకు శ్రాద్ధం పెడితే కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. భాద్రపద కృష్ణ అమావాస్య మహాలయమావాస్య , ఈ రోజున పితృ తర్పణాలు , దానధర్మాలు చేయడం ఆచారం.

భాద్రపద బహుళ తదియ ని ఉండ్రాళ్ళ తద్దేగా చెప్పబడింది. ఇది స్త్రీలు చేసుకొనే పండుగ , ముఖ్యంగా కన్నె పిల్లలు గౌరీ దేవిని పూజించి , ఉండ్రాళ్ళను నివేదిస్తే మంచి భర్త వస్తాడని చెప్పబడింది. స్త్రీలకు అయిదవతనం వృద్ధి చెందుతుంది.భాద్రపద కృష్ణ ఏకాదశి అజ ఏకాదశి దీన్ని ధర్మప్రభ ఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజు ఏకాదశి వ్రతమాచరించి నూనె గింజలను దానం చేస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చు.



# హైడ్రా లక్ష్యాలు-ముందున్న సవాళ్లు

14 వ శతాబ్దం నుండి భాగ్యనగరం సరస్సులు , చెరువులు , తోటలకు ప్రసిద్ధి. బషీర్‌బాగ్ , మూసారాంబాగ్ , లక్డికాపూల్ , గోల్కొండ , నాంపల్లి , హుస్సేన్ సాగర్ , తదిదర ప్రాంతాలన్నీ చెరువులు , సరస్సులతో నిండి ఉండేవి (బాగ్ అంటే తోటలు అని అర్థం) . మారుతున్న కాలానుక్రమంగా నగరం కూడా విస్తరిస్తూ వస్తోంది . జనాభా పెరుగుదల , కావాల్సిన మౌలిక వసతుల కల్పన కోసం భారీగా నిర్మాణాలు జరిగాయి . ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 1980 నుండి హైదరాబాద్ నగరం భారీగా విస్తరించింది . మున్సిపల్ కార్పొరేషన్ పరిధి దాటి గ్రేటర్ వరకు విస్తరించి నేడు దాదాపు హైదరాబాద్ మహానగరం హెచ్ ఎండీఏ పరిధి 7 జిల్లాలలో విస్తరించి ఉంది . ఇక్కడి నుండే అసలు సమస్యలు మొదలవడం ప్రారంభం అయ్యింది . అసమతుల్య వృద్ధి వలన నగర విస్తరణ చెరువులు , సరస్సులు , తోటలు తదిదర కొండ ప్రాంతాల్లో సైతం విస్తరించడం వలన ప్రకృతికి విరుద్ధంగా కట్టడాలు నిర్మించడం వలన పూర్తిగా డ్రైనేజీ వ్యవస్థ అమగ్యగోచనంగా మారింది . ఈ విధంగా అక్రమ కట్టడాలు , చెరువుల ఆక్రమణలు విపరీతంగా నగరమంతటా వ్యాప్తి చెందడం వలన నేడు ఇబ్బందులు గురికావాల్సి వస్తుంది . అందుకోసమే ప్రభుత్వం హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చింది .

**హైడ్రా లక్ష్యాలు**

హైడ్రా (HYDRAA-Hyderabad Disaster Response and Asset Protection Agency ) హైడ్రా వ్యవస్థ ప్రధాన ఉద్దేశం ఆక్రమణలను అరికట్టడం . గత కొన్నేళ్లుగా నగరం శివారుల్లో అనేక ఆక్రమణలు చోటు చేసుకున్నాయి . అనేక చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయి . వీటన్నిటిని అరికట్టాల్సిన బాధ్యత హైడ్రా మీద ఉన్నది . ఇవేకాక అనేక చెరువుల ఆక్రమణలు భారీగా చోటు చేసుకున్నాయి . అప్ప చెరువు , నల్ల చెరువు , రుక్నుడ్ దౌలా చెరువు , కూకట్పల్లి చెరువు , అమీనపూర్ తదిదర చెరువులు ఆక్రమణలు గురవుతూ వస్తున్నాయ్ . ఈ చెరువులను మిషన్ కాకతీయ తరహాలో మిషన్ మోడ్ పద్దతిలో



చెరువుల పున్నరుద్ధరించాల్సిన అవసరం ఉంది . చెరువుల చుట్టూ రిటెన్షన్ వాల్ ను నిర్మించి , పూడికను తీసి , సరిహద్దులు నిర్మిస్తే చెరువులు మల్లి నీటితో కళకళలాడుతాయి . మారుతున్న గ్లోబల్ వార్మింగ్ వలన కొత్త రకమైన విప్పత్తులు చోటు చేసుకుంటున్నాయి . (Urban Floods, Urban Fires) లాంటివి తరుచూ మన నగరంలో చూస్తూ ఉన్నాం . వీటిని అరికట్టాల్సిన అవసరం ఉంది . హైడ్రా పేరులోనే “Disaster Response” ఉన్నందు వలన విప్పుతు నిర్వహణ సైతం పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. నగరంలో అనేక నిర్మాణాలు అగ్నిమాపక (Fire safety Permissions) అనుమతి లేకుండా ఉన్నాయి. చట్టవిరుద్ధమైన విద్యుత్తు కనెక్షన్లు ద్వారా తరచూ బంగ్లాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ప్రాణాలు సైతం కోల్పోవడం జరుగుతోంది . ఈ నిర్మాణాలనుతప్పకుండ హైడ్రా ఆధ్వర్యంలో సర్వే చేసి కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాల్సిన అవసరం ఉంది . ఇక పోతే నగరంలో వాతావరణ మార్పుల వలన భారీ వర్షాలు సంభవిస్తున్నాయి . సీవరేజ్ మాస్టర్ ప్లాన్ ను తక్షణమే ప్రభుత్వం SPEED 19 (Smart, Pro active , efficient and Effective Delivery of services ) క్రింద చేర్చి అమలు చేయాల్సిన అవసరం ఉంది . ముంబై , చెన్నై తరహాలో I – FLOWS (Flood Warning Systems)వార్నింగ్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది .

ఇక పోతే నగరంలో ట్రాఫిక్ సమస్య భారీగా ఉంది . ఇరుకు వీధుల్లో అనేక వ్యాపారాలు జరుగుతున్నయి. చార్మినార్ , సుల్తాన్ బజార్ , బేగం బజార్ , సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీగా వ్యాపారం జరుగుతోంది . ఈ ప్రాంతాల్లో ఏదైనా విప్పుతూ సంభవిస్తే నష్టం కూడా భారీగా ఉంటుంది . ఈ ప్రాంతాలకు వచ్చే వినియోగదారులకు సరైన మౌలిక వసతులు , ట్రాఫిక్ సమస్యను జీహెచ్ ఎంసీ సమన్వయంతో హైడ్రా చర్యలు తీసుకోవాలి . ప్రపంచ ఏఐ సిటీ గా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దాలన్నా ప్రభుత్వ లక్ష్యం సాధ్యం కావాలంటే హైడ్రా వ్యవస్థను 360లో వ్యాప్తి చెందాల్సిన అవసరం ఉంది . కేవలం చెరువుల ఆక్రమణలు మాత్రమే కాకుండా పైన పేర్కొన అంశాలను సైతం హైడ్రా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది .

**సవాళ్లు**

హైడ్రా వ్యవస్థకు ప్రస్తుతం అతి పెద్ద సవాలు రాజకీయాలనే చెప్పవచ్చు . అక్రమ నిర్మాణాలను తొలగించే సమయంలో పార్టీలకు అతీతంగా హైడ్రా వ్యవహరించాల్సిన అవసరం చాలా ఉంది . అక్రమ నిర్మాణాలను తొలగించే సమయంలో నోటీసులు ఇవ్వడం , ప్రత్యామ్నాయ అంశాలను ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది ఎదనుకంటె కేవలం కూల్చడం మాత్రమే పరిష్కారం కాదు . ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కూడా పట్టాలు (Assigned Lands) ఉంటాయి . వాటిని క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు . ఫిర్యాదుల పరిష్కారం కోసం ఒక సెల్ ను హైడ్రా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది . ఎన్‌డీఆర్ ఎఫ్ తరహాలోనే హైడ్రా వ్యవస్థకు సిబ్బందిని (Policing Force) ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది . రాష్ట్ర ప్రభుత్వం Telangana State Protection of Lakes and Prevention of Encroachments Act అనే ఒక చట్టాన్ని తీసుకువచ్చి హైడ్రా వ్యవస్థను రాష్ట్ర వ్యాప్తంగా ఇతర నగరాల్లో విస్తరించాల్సిన అవసరం ఉంది . నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం , ప్రైవేట్ , స్వచ్ఛంద సంస్థల ద్వారా సేకరించి పీపీపీ పద్దతిలోచేపట్టినట్లైతే నిధులకు కొరత ఉండదు . మున్సిపల్ , పురపాలక శాఖలు సైతం లేఔట్లు , భవన నిర్మాణ అనుమతులు జారీ చేసే సమయంలో హైడ్రా అనుమతి తప్పని సరి తీసుకునే విధంగా చట్టాన్ని సవరించాలి . ఈ విధంగా చేస్తే హైదరాబాద్ నగరం సైతం టోక్యో , షాంఘై నగరాల మాదిరి ఎలాంటి విప్పత్తులు ఎదురైనా తట్టుకునే విధంగా అద్భుతంగా తయారవుతుంది.



-కన్నోజు శ్రీహర్ష
Mobile: 8985130032

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# రూ.130 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇవ్వడానికి తీర్మానం

**విశ్వంభర, హైదరాబాద్:** వరదల బీభత్సానికి నష్టపోయిన వారికి సహాయ సహకారాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల, కార్మికుల , పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల ఒకరోజు మూల వేతనాన్ని రూ.130 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందని రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ లు తెలిపారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మారం జగదీశ్వర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం హైదరాబాద్ టీఎన్జీవో భవన్లో జేఏసీ స్టీరింగ్ కమిటీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని మానవతా దృక్పథంతో ఆలోచించి 205 సంఘాలం అందరం కలిసి ఉద్యోగుల అందరి పక్షాన ఒకరోజు మూలవేతనాన్ని అనగా 130కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిదికి ఇవ్వడానికి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది అని తెలిపారు. ఇప్పటికే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, నాలుగవ తరగతి ఉద్యోగులు అంద రూ కూడా వారి వారి స్థాయిల్లో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు అని తెలియజేసారు. ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ విపత్కర పరిస్థితులనుండి బయటపడగానే సచివాలయంలో ఉద్యోగులందరికీ పెండింగ్ లో ఉన్న సమస్యల పై చర్చించి నిర్ణయం తీసుకుందామని అనడం శుభపరిణామం అని అన్నారు.కొంతమంది గత ప్రభుత్వంతో అంటకాగి జేఏసీ ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు. సమావేశంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పి. శ్రీపాల్ రెడ్డి,



టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, ఎస్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధానంద గౌడ్, ట్రెస్సా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి, కార్యదర్శి కె. గౌతం కుమార్, నాలుగవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు.

# విరాళంగా ఉద్యోగుల ఒక రోజు వేతనం

## రూ.100కోట్ల విరాళాన్ని ప్రకటించిన తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ



**విశ్వంభర,హైదరాబాద్:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షణ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం తగు సహాయక చర్యలను సైతం వేగవంతం చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల సైతం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని గుర్తు చేశారు. అయినప్పటికీ విపత్తు భారీగానే నష్టాన్ని కలిగిచిందన్నారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందని, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీనిని అతిపెద్ద విపత్తుగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ భావించిందని తెలిపారు. ఇలాంటి సమయంలో తమ వంతుగా ప్రభుత్వానికి ఆర్థిక పరంగా చేయూతగా నిలవాలని భావించామన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని ఉద్యోగుల తరుపున ఒక రోజు వేతనం సుమారు రూ.100 కోట్లను ప్రభుత్వానికి ఇచ్చేందుకు స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ వంతు సహాకారంగా ఒక రోజు వేతనం వరద సహాయక చర్యలకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాలలోని ఉద్యోగుల తరుపున సమిష్టి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఉద్యోగులుగా వరద విపత్తు సృష్టించిన ప్రాంతాలలో ప్రత్యక్షంగా సహాయక చర్యలలో పాల్గొనడంతో పాటు బాధ్యతగా ఒక రోజు వేతనాన్ని విరాళంగా అంద చేయనున్నట్టుగా జాయింట్ యాక్షణ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి చెప్పారు.

# అధ్వాన్నంగా ఉన్న రోడ్డు, అవస్థలు పడుతున్న ప్రజలు



**విశ్వంభర,ప్రజ్ఞాపూర్:** గజ్వేల్ జిల్లా ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డ్ మహతి ఆడిటోరియం రోడ్డులో గల ప్రజలు అద్వాన్నంగా ఉన్న రోడ్డు వలన అవస్థలు పడుతున్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో ఈ వార్డు నుంచి గెలిచిన కౌన్సిలర్ ఒక్కసారి కూడా వార్డుకు రాలేదన్నారు. డ్రైనేజీలు రోడ్లు గాని చాలా అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఈ వార్డులోకి కౌన్సిలర్, చైర్మ న్ ఇంతవరకు సందర్శించలేదని వార్డు ప్రజలు తులిపారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, పారిశుద్ధ్య లేక మహతి ఆడిటోరియం పక్క గల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపయో గపడే రోడ్డు వదిలేసి ఎక్కడో అవసరం లేని చోట ప్రజలు తిరగని చోట ఇండ్లు లేనిచోట ఈ కౌన్సి లర్ రోడ్లు వేశారని వార్డు ప్రజలు ఆవేదన చెందారు. ఇప్పటికైనా మునిసిపల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని 17వ వార్డ్ ప్రజలు కోరుచున్నారు.

# చిక్కుకున్న వారిని కాపాడిన ఫైర్, పోలీస్ సిబ్బంది



**విశ్వంభర, డిండి:** డిండి మండల పరిధిలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన పలువురు చేపలు పట్టటానికి వెళ్లి సిద్దాపూర్ శివారులోని వాగుల్లో చిక్కుకున్న10 మంది చెంచులను స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ, వారి క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బయటకు తీసుకువచ్చేందుకు స్వయంగా రంగంలోకి దిగి, అచ్చంపేట ఫైర్ మరియూ పోలీస్ సిబ్బంది సహాయంతో సురక్షితంగా కాపాడారు. వరద బాధితులను నేరుగా కలిసి ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు. వరదల కారణంగా మరణించిన వ్యక్తుల కుటుంబాలకు రూ. 4 లక్షల నుంచి రూ.5 లక్షలకు ఎక్స్ గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఒక్కో ఎకరానికి రూ. 10 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందించేందుకు తక్షణ ఏర్పాట్లు చేయలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు నిత్యావసర వస్తువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టంపై అన్ని విభాగాల నుంచి ప్రాథమిక నివేదికలు తెప్పించి, బాధితులను ఆదుకోవాలని అన్నారు. దేవరకొండ డి.ఎస్.పి గిరిబాబు, సిఐ సురేష్, ఎస్ ఐ రాజు పోలీస్ సిబ్బంది, దిండి మండల తాసిల్దార్ ఆంజనే యులు, ఆర్ఐ నరసింహ, రెవెన్యూ శాఖ, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను, డిండి మాజీ సర్పంచి పోలం లక్ష్మణ్, శైలేష్, గడ్డామిది సాయి, మేకల కాసన్న, శ్రీను, శ్రీనివాస్ గౌడ్, సాయి బాబా, ఖలీమ్, అచ్చంపేట పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు నాయకులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆర్అండ్ఆర్ ప్యాకేజి కల్పించి ఇండ్ల నిర్మాణాలు చేపడతాం



**విశ్వంభర, చందంపేట:** చందంపేట మండల పరిధిలోని నక్కలగండి ప్రాజెక్టులో ముంపుకు గురవుతున్న నక్కలగండి తండా, కేశ్య తండా గ్రామాలు గత రెండు రోజులుగా ప్రవహిస్తున్న డిండి వాగు వల్ల నష్టపోయిన పంటలను మరియు ఇండ్లను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకొని నిర్వాసితుల కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడే నివాసం ఉంటూ భూములు సాగు చేస్తూ ప్రస్తుతం ముంపు ద్వారా నష్టం వాటిల్లిన పంటలను వివరాలను వ్యవసాయ అధికారుల ద్వారా పరిశీలన చేయించి నష్ట పరిహారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బద్య నాయక్, మాజీ ఎంపీపీలు పార్వతి చందు నాయక్, గోవింద్, ముత్యాల సర్వయ్య, జడ్పిటిసి బుజ్జి లచ్చిరామ్ నాయక్, యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు భరత్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో భారీ వర్షాలపై సమీక్ష



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీలో జరిగిన మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్, ఫ్లోర్ లీడర్ల సమావేశంలో భారీ వర్షాలన వ్యాధులు ప్రబల కుండా తక్షణమే క్లోరినేషన్ బ్లీచింగ్ క్లీనింగ్ పారిశుద్ధ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరడం జరిగింది. 36 వార్డు పరిధిలోని ఏ క్యాబిన్ వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ను మరింత అభివృద్ధి చేయాలని భవిష్యత్తులో ఆ ప్రాంతంలో రైల్వే ట్రాక్ ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని, రావినారాయణరెడ్డి సిగ్నల్ కాలనీ వద్ద రైల్వే అండర్ ప్రాసెస్ ను అభివృద్ధి చేయాలని సూచించడం జరిగింది. 22 వార్డు పరిధిలోని పోతిరెడ్డి చెరువును పరిరక్షించి అభివృద్ధి చేయాలని కోరడం జరిగింది. భారీ వర్షాలు నేపథ్యంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ స్తంభాలు, చెరువుల పరిరక్షణ తదితరంపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత విషయాలన్నీ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తద్వారా మహబూబాద్ మున్సిపాలిటీ ఎక్కువ నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి కోరారు.

# పిల్లలలో రక్తహీనత లేకుండా పోషకాహారం ఇవ్వాలి



**విశ్వంభర, చింతపల్లి:**చింతపల్లి మండల కేంద్రంలోని 4వ అంగన్వాడి కేంద్రంలో పోషన్ పక్షం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ చింతపల్లి సూపర్వైజర్ పార్వతి హాజరై మాట్లాడుతూ రక్తహీనత వలన అనర్థాలు రాకుండా తీసుకోవలసిన ఆహారం గురించి ఆమె వివరించారు. పోషకాహార లోపంతో చిన్న పిల్లలు ఇబ్బందులు పడకుండా పిల్లలు ఆహారం గురించి వివరించి చిన్న పిల్లల పట్ల తగుజాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పచ్చదనంలో పరిశుభ్రతలో భాగంగా అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, పిల్లలచే కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పద్మావతి, తల్లులు మరియు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఆవు దూడలను చంపిన గుర్తు తెలియని జంతువు



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం చేగుంట గ్రామంలో రైతు పోరెడ్డి ఉపేందర్రెడ్డి బావి దగ్గర తన రెండు ఆవు దూడలను చిరుత పులి చంపి వేయడం జరిగింది అని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎల్లయ్య హనుమంతు సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది. సంఘటన స్థలం వద్ద తిమ్మజిపేట ఏఎస్ఐ, వెటర్నరీ డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఫారెస్ట్ అధికారుల నుంచి ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత వెంటనే రెండు ఆవు దూడలను కోల్పోయినటువంటి రైతు ఉపేందర్ రెడ్డి కి ప్రభుత్వం నుంచి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని మాజీ ఎంపిటిసి కిల్లె మల్లయ్య కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కదిరి భీమ్ రెడ్డి చెన్నయ్య గంగాపురి తదితరులు ఉన్నారు.

# మతి స్థిమితం లేని యువకుడిని కాపాడిన పోలీసులు



**విశ్వంభర,కురవి:** మహబూబాబాద్కురవి మండలం లోని నేరడ గ్రామం వద్ద సోమవారం వరద నీటిలోకి ఒక వ్యక్తి వెళ్తున్నాడు అని దయల్ 100 సమాచారం రాగ స్పందించిన పోలీస్లు ఎఎస్ఐ సదయ్య, హెచ్సి వెంకటయ్య, పీసీ కాశీరాంలు అక్కడకు హుటాహుటిన చేరుకొని ఆ వ్యక్తిని వరద నీటి నుండి బయటకు తీసుకు వచ్చి అనంతరం కురవి పోలీస్ స్టేషన్ కి తరలించారు. వివరాలు అడగగా అతను తనపేరు ముళ్ళపూడి హర్షవర్ధన్ తండ్రి పేరు శ్రీకాంత్ అని, తమది గుంటూరు జిల్లా పచ్చలపాడిపారు గ్రామం అనిచెప్పాడు. విషయాన్ని గుంటూరు పోలీస్ ద్వారా అతని తల్లిదండ్రులకు తెలిపారు. కుటుంబ సభ్యులు కురవి పోలీస్ స్టేషన్ కు వచ్చి అబ్బాయి రెండు రోజుల క్రితం విజయవాడ లో తప్పిపోయాడని, విజయవాడలో వచ్చిన వరదలు చూసి అతనిపై ఆశలు వదులుకున్నాం అని కన్నీటి పర్యంతమయ్యారు. అబ్బాయిని కాపాడి క్షేమంగా అప్పగించిన కురవి పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాల సమగ్ర సమాచారం(యూ-డైస్)పై శిక్షణా కార్యక్రమం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూరు(ఎం) నందు ఏర్పాటు చేయటం జరిగినది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి కూరెళ్ళ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యం దామోదర్ మాట్లాడుతూ పాఠశాల సమగ్ర సమాచారం పై(యూ-డైస్) 2024-25కు సంబంధించి అందరు ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల, ఉపాధ్యాయుల నమోదు మరియు పాఠశాలకు సంబంధించిన భౌతిక వసతులకు సంబందించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఆన్లైన్ లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయు లను కోరడం జరిగినది. యూ-డైస్కు ఆన్లైన్ కు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్ సిహెచ్ చిత్తరంజన్ శిక్షణ ఇవ్వడం జరిగినది. ప్రధానోపాధ్యాయులు యం రత్నమాల, యం శ్రీధర్ రావు, యం పద్మ, కే రమేష్, ఎల్డీఎ యం వెంకటేశ్వర్లు, సీఆర్పీలు కే.సత్తయ్య, టి నర్సయ్య మరియు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# బిక్కేరులో చెక్డ్యాంకు గండి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తుర్కల రేపాక గ్రామ పరిధిలోని బిక్కేరు వాగులో చెక్ డ్యాంకు గండి పడడంతో అక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెక్ డ్యాంకు గండి పడడంతో వాగులోని నీళ్ళు భారీగా కిందకి వెళ్ళి పోవడంతో పంటకు నీళుళ్ళ అందక భవిష్యత్తు పంటకు నీళ్ళు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు అలోచన చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు. టి రేపాక రైతులు యాస అంజి రెడ్డి, ఏనుత్తుల రాములు, చింతల కృష్ణ, నాగసరం మచ్చగిరి, తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**విశ్వంభర,మెట్పల్లి:** మెట్పల్లి మున్సిపల్ పరిధిలోని 17,20వ వార్డులలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి సందర్శించారు. వెంకట్రావుపేట చెరువు మత్తడి నుండి వచ్చే నీటి ప్రవాహాన్ని అంచనా వేసి అధికారులకు సూచనలు ఇచ్చారు. నేషనల్ హైవే డివైడర్ పైన నాటిన మొక్కలను కటింగ్ చేస్తుండగా పరిశీలించి మొక్కకు మొక్కకు మధ్య పూల మొక్కలు పెట్టాలని ఆదేశించారు. నేషనల్ హైవే డ్రైనేజ్ కాంట్రాక్టర్ కట్టకుండా వదిలిపెట్టిన డ్రైనేజీలను కట్టించాలని, మురికి కాల్వలో చుట్టు పెరిగిన గడ్డిని తొలగించాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహం ఆగి ఉన్నచో అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని, పెద్దనాళాల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ టీ మోహన్, ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్ పాల్గొన్నారు.



(విశ్వంభర, మహబూబాబాద్): అత్యంత వేగంగా వరదకు కొట్టుకపోయిన రైల్వే ట్రాక్ పనులకు మరమ్మత్తులు చేసి రికార్డు సృష్టించిన రైల్వే శాఖ అధికారులు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసలపల్లిలో రైల్వే మరమ్మత్తు పనులు పూర్తి అవడంతో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు.

# కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని దీక్ష



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చెయ్యాలని 10 రోజులుగ దీక్షచేస్తున్న బీసి నాయకుడు బత్తుల సిద్దేశ్వర్ని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్యగౌడ్, సీపీఎం నాయకులు చెరుపల్లి సీతారాములు కలిసి పరామర్శించారు.

# ప్రణాళిక అధికారిగా బాబురావు నియామకం



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీఓ)గా బాధ్యతలు చేపట్టిన డి.బాబురావు మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.భూపాలపల్లి జిల్లాలో సీపీఓగా పనిచేస్తున్న కే.శామ్యూల్ ఉపసంచలకులుగా పదోన్నతి పొంది యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ పై వెళ్ళాగా నిర్మల్ జిల్లా సీపీఓగా పని చేస్తున్న డి. బాబురావు భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

# గణేష్ నిమజ్జనానికి చెరువులను సిద్ధం చేయాలి: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

- సఫిల్ గూడ చెరువును పరిశీలించిన మేయర్
- గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసిన మేయర్

**విశ్వంభర, హైదరాబాద్ :** గణేష నిమజ్జనానికి అవసరమైన అన్ని వసతులతో సఫిల్ గూడ చెరువును సిద్ధం చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంబంధిత అధికారులకు ఆదేశించారు.మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సికింద్రాబాద్ జోన్ సఫిల్ గూడ మినీ ట్యాంక్ ను పరిశీలించారు. శానిటేషన్ రోడ్ల స్థితిగతులను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయా అధికారులకు గణేష నిమజ్జన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ 7 నుండి 17 వరకు గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని, గణేష్ నిమజ్జనానికి సఫీల్ గూడ చెరువు వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సజా వుగా జరగాలని, ఎలాంటి ఫిర్యాదులు రావద్దన్నారు. క్షేత్ర పరిధి.లో పారి శుద్ధ్య నిర్వహణ పై నిరంతరం పర్యవేక్షణ చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు.డార్క్ స్పాట్స్ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లైటింగ్, పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ర్యాలీ కొనసాగే రహదారులు బాగుండేలా చర్యలు చేపట్టాలని, రోడ్లపై పాట్ హెూల్స్ లేకుండా వెంటనే పూడ్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా చెట్టు కొమ్మలను కత్తిరించాలని, చెరువు వద్ద బోట్‌ను అందుబాటులో ఉంచాలని, స్ట్రీట్ లైట్స్ వెలిగే లా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. భక్తులకు త్రాగు నీరు, తదితర కనీస సౌకర్యాలు, కల్పించాలని అధికారులకు సూచించారు. ఎక్కువ మొత్తంలో మొబై ల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయా లని, నిమజ్జన సమయంలో సంబంధిత సర్కిళ్లలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఇప్పటివరకు పూర్తి చేసిన పనులను మేయర్‌కు



వివరించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఉత్సవ కమిటీ మేయర్ దృష్టికి తీసుకువచ్చిన ఆయా సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపినందుకు ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ మేయర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ తనిఖీలో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి తో పాటు జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ రాజు, పోలీస్, శానిటేషన్, లేక్స్, ఎంటమాలజీ, వైద్య ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్, తదితర విభాగాల అధికారులు, కార్పొరేటర్ శ్రావణ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# యువ శాస్త్రవేత్త కుటుంబాన్ని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, మహబూబాబాద్:** వరదల్లో కొట్టుకుపోయి దుర్మరణం పాలైన వ్యవసాయ శాస్త్రవేత్త అశ్విని కుటుంబాన్ని సీఎం రేవంత్ రెడ్డి పరా మర్శించారు. ఢిల్లీలోని జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గంగారం తండాకు చెందిన నునావత్ అశ్వి ని శాస్త్ర వేత్త. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగే ఓ సదస్సులో పాల్గొ నేందుకు తండ్రి మోతీలాల్‌తో కలిసి కారులో ఆదివారం అశ్విని బయ లుదేరారు. మరిపెడ మండలం పురుషోత్త మయ్య గూడెం వద్ద వంతెనపై ఆకేరు వాగు ప్రవాహానికి కారు కొట్టు కుపోయింది. అశ్వినితో పాటు ఆమె తండ్రి మృతి చెందగావారి కుటుంబాన్ని రేవంత్‌రెడ్డి,మంత్రులు,ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పరామర్శించారు.

# మత్స్యకారులు సహాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ మత్స్యకారులకు సహాయం కోసం రాష్ట్ర మత్స్యశాఖ కమీషనర్ డా.ప్రియాంక అలా, తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని మత్స్య భవన్ లో హెల్ప్ లైన్ నెంబర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని ప్రాజెక్ట్ లు, చెరువులు, కుంటలు భారీగా నిండిపోయి ఉన్నయని, కనుక చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు సహాయం కోసం ఈ హెల్ప్ లైన్ నెంబర్ 8090199299 కు కాల్ చేయవచ్చునని తెలిపారు. మత్స్యకారుల సహాయార్థం 24 గంటలు ఫోన్ ద్వారా సేవ లు అందించేందుకు ఈ హెల్ప్ లైన్ నెంబర్ అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు..

# గోదావరి వరద ఉధృతిని పరిశీలించిన అడిషనల్ ఎస్పీ



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గోదావరి మెయిన్ ఘాట్ వద్ద ప్రవాహ ఉధృతిని భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు. పైన వర్షాలు అధికంగా ఉండడం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు, ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూ నీటిమట్టం పెరుగుతుంది. షాపు యజమానులు, ప్రజలు, జాలర్లు, రైతులు, భక్తులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మహాదేవ్‌పూర్ సీఐ రామ చంద్రరావు, కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కానిస్టేబుల్ కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, అంబర్ పేట్:** అంబర్పేట్ లోని గోల్నాక డివిజన్ శాంతినగర్ లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యటించారు. శాంతినగర్ లో 7 లక్షల విలువ గల డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. శాంతి నగర్‌లో 7లక్షల విలువ గల డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉంద న్నారు. రానున్న రోజుల్లో శాంతి నగర్ లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



(విశ్వంభర, మహబూ బాబా ద్): మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలు సందర్శించి బాధి తులతో మాట్లాడి కావలసిన చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమ ంలో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రజాప్రతి నిధులు, అధి కారులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలకు కృషి చేస్తా: మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస రెడ్డి అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఇప్పటికే పలు మార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, త్వరలో కొత్త పాలసీ రూపకల్పన ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తో పాటు పలువురు ప్రతినిధులు మంగళవారం మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య, తమ సొసైటీ విషయాలపై చర్చించారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. తమ సొసైటీ 2008 లో ఏర్పడిందని, అప్పటి నుంచి మూడు దఫాలుగా జర్నలిస్టుల నుంచి సభ్యత్వం తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం సొసైటీలో 1300 మంది సభ్యులున్నారని అధ్యక్షుడు మామిడి సోమయ్య వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వివిధ పత్రికలు,ఛానెళ్ళలో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులు చాలా ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉందని, అయితే ఏ విధంగా ఇవ్వాలన్న విషయంలో కసరత్తు చేయాల్సి ఉన్నందున దీనికి కొంత సమయం పడుతుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఉన్న 1300 మంది జర్నలిస్టుల అర్హత, సీనియారిటీ ప్రకారం లిస్టు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు యర్రమిల్లి రామారావు, కరుణాకర్, అంజిరెడ్డి, నాగవాణి, టి. శాంతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఉద్యమాలకు విద్యార్థులు ముందుండాలి



**విశ్వంభర, హైదరాబాద్:** బీసీ ఉద్యమాలకు విద్యార్థులు ముందుండాలని బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అన్నారు. మంగళవారం బి.సి విద్యార్థుల డిమాండ్ల సాధన కొరకు రవీంద్ర భారతి లో తెలంగాణ రాష్ట్ర బి.సి. విద్యార్థి సంఘం అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విద్యార్థుల సదస్సు కార్యక్రమానికి ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎంపీ వి హనుమంతరావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ ఫీజుల బకాయిల 4వేల 500కోట్లు వెంటనే విడుదల చేయాలి అని అన్నారు.పెరిగిన ధరల ప్రకారం ఎస్సీ/ఎస్టీ/ బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను నెలకు రూ.1500 నుంచి 3 వేలకు పెంచాలి. పాఠశాల హాస్టళ్లకు గురుకుల పాఠశాల విద్యార్థుల ఆహారపు చార్జీలు 8 నుంచి 10వ తరగతి వారికి రూ.1100నుంచి రూ.2500/-కు, 3వ తరగతి నుంచి 7 తరగతి వారికి రూ.950 రూపాయల నుంచి రూ.2000 కు పెంచాలి అని డిమాండ్ చేశారు.ధరఖాస్తు చేసుకొన్న ప్రతి విద్యార్థికి విదేశీ విద్యా స్టైఫండ్ మంజూరు చేయాలి.ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ప్రైవేటు యూనివర్సిటీలో అమలు చేయాలి ఈ సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కు ఒకటి చొప్పున 129 బి.సి గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలి.బి.సి స్టడీ సర్కిల్ కు 200 కోట్లు కేటాయించాలి. కోచింగ్ పద్ధతులు మార్చాలి. అర్హులందరికీ డి ఎస్ సి, గ్రూప్-1,2,3,4 సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలి.



(విశ్వం భర, వెల్దండ): వెల్దండ లోని అక్షర స్కూల్లో షైన్ వేవ్ బ్లడ్ గ్రూపింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో స్కూల్ ప్రిన్సిపల్ నారాయణన్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులందరూద పాల్గొని తమ గ్రూపు ఏమిటో తెలుసుకున్నారన్నారు.

# వృద్ధాశ్రమానికి రూ.50వేలు అందజేత




**విశ్వంభర, ఎల్బీనగర్:** నల్గొండ జిల్లా నర్సింహులగూడెం కు చెందిన కొసనం శ్రీకాంత్ రెడ్డి వారి బావమరిది పల్ రెడ్డి రాకాష్ రెడ్డి వారి మిత్రులు శశాంక్ రెడ్డి, జి.శ్రీను, ఎస్.కిరణ్, చెన్నకేశవ, అనీల్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, సైదులు, సాయి , సంతోష్ రెడ్డి ల ద్వారా వనస్థలిపురంలోని ఓల్డ్ ఏజ్ హెూమ్ గురించి తెలుసుకున్న కోసనం శ్రీకాంత్ రెడ్డి వారందరితో కలిసి ఓల్డ్ ఏజ్ హెూమ్ నకు వచ్చారు.అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల బాగోగులను విచారించి,వారి ఎడల దయ కలిగి,వారి కొరకు మరిన్ని సౌకర్యములు కల్పించి, వారు తమ శేష జీవితం ప్రశాంతముగా గడపాలని ఆశీస్తూ, గత ఏడాది వినాయక చతుర్థి నాడు లడ్డు వేలం పాట ద్వారా వొచ్చిన రూ .50,000 రూపాయిలను ఓల్డ్ ఏజ్ హెూమ్ కు విరాళముగా ఆందించినారు. సర్వ ఫౌండేషన్ చైర్మన్ శంకర్ ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# బిఆర్ఎస్ నాయకుల పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఖమ్మంలో బిఅర్ఎస్ ప్రజా ప్రతినిధుల పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. మంగళవారం ఆర్కే పురంలో ఆయన మాట్లాడుతూ వరదల వలన నష్టపోయిన బాధితుల ను పరామర్శించడానికి వెళ్లిన బి అర్ ఎస్ ప్రజాప్రతినిధుల పై కాంగ్రేస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం, అసాధారణ వర్షపాతం వలన తీవ్ర ముంపు కు గురైన ప్రజలను పరామర్శించి వాళ్ల కష్టాలు ప్రభుత్వ దృష్టికి తీసుకరావడానికి వచ్చిన హరిష్ రావు తో పాటు ఇతర నేతల వాహనాల పై రాళ్ల దాడి చేయడం అమానుషం అని అన్నారు.ప్రతిపక్ష నేతలు వరద బాధితుల ను పరామర్శించడానికి రావలని ముఖ్యమంత్రి పిలుపు ఇచ్చి ప్రతిపక్షాల పై దాడి చేయించడం దుర్మార్గం అని మీరు ఎన్ని దాడులు చేసినా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం అని హెచ్చరించారు. నష్ట పోయిన బాధితుల పక్షాన పోరాడుతాం అని అన్నారు.

# కరాటే పోటీలో సత్తా చాటిన అసిరెడ్డి పల్లి విద్యార్థిని



**విశ్వంభర, ఎల్బీనగర్:** రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం పరిధి అసిరెడిపల్లీ గ్రామంకు చెందిన కాగుల భారత్,పార్వతి దంపతుల కుమార్తె అపర్ణ జాతీయ స్థాయి కరాటే పోటీలో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటింది. మేడ్చల్ లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే అండర్ (12-14)గ్రాండ్ చాంపియన్ షిప్ లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచింది. అపర్ణ ప్రస్తుతం కర్మాంఘట్ శ్రీ సరస్వతి పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది జాతీయ స్థాయి కరాటే పోటీలో ప్రతిభ కనబర్చిన సందర్భంగా తలిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు, అపర్ణను అభినందించారు. అపర్ణ గెలుపుపై తల్లితండ్రులు, గురువు మహేష్ మాస్టర్ ఆనందం వ్యక్తం చేశారు.

# భవనం పై నుండి పడి వ్యక్తి మృతి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ప్రమాదవశాత్తు భవనం పై నుండి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన భీమ్ శంకర్ అలియాస్ భీమేష్ తన కుటుంబంతో కలిసి సరూర్నగర్ లో నీ భగత్ సింగ్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. సరూర్నగర్ శ్రీ వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 12 లో గత మూడు సంవత్సరాల నుండి శ్రీ బాలాజీ నివాస్ అనే అపార్ట్మెంట్లో వాచ్మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం అపార్ట్మెంట్ పైన స్టోర్ రూమ్ లో వినాయక మండపానికి సంబంధించిన సామాగ్రి తీసుకురమ్మని అపార్ట్మెంట్ యాజమాన్యం చెప్పారు. దీంతో సామాగ్రిని తీసుకురావడనికి అపార్ట్మెంట్ పైకి వెళ్ళాడు. సామాగ్రి తీసుకొని డోరు ఉక్కు ఊడిపోయి ప్రమాదవశాత్తు అపార్ట్మెంట్ పై నుండి ఫస్ట్ ఫ్లోర్ లో పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు అయ్యా యి. ఇది గమనించిన అపార్ట్మెంట్ వాసులు వెంటనే 108 అంబులెన్స్ ఫోన్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి అప్పటికే భీమేష్ మరణించినట్లు వారు తెలిపారు. అతని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సైదిరెడ్డి తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయం లోని కలెక్టర్ ఛాంబర్ లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. కృత్రిమ, రంగులు, రసాయనాలతో కూడిన విగ్రహాలు పూజించి చెరువులలో, కాలువలలో నిమజ్జనం చేయడం వలన జల వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని, తద్వారా జలాల్లో నివసించే జీవరాసులు మనుగడ కష్టమవుతుందని తెలిపారు. మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్రజలకు అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ నెల 6వ తేదిన జిల్లాలోని ప్రధాన కూడళ్ళులో 8 అంగుళాల మట్టి గణపతి లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు మట్టి విగ్రహాలను పూజించి జలాశయాలు కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జడ్పి సీఈవో విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్, పరిశ్రమలశాఖ జిఎం సిద్దార్థ రెడ్డి, డీఈఓ రాజేందర్, బిసి, ఎస్సి సంక్షేమ అధికారులు శైలజ, సునిత, ఉద్యానవన శాకాధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు ఎంపీ వద్దిరాజు చేయూత



**విశ్వంభర, ఖమ్మం:** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎల్లప్పుడూ ముందుండే బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా మున్నేరు ఉగ్రరూపం దాల్చడంతో ఇండ్లలోకి వరద పోటెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎంపీ రవిచంద్ర ఢిల్లీ నుంచి సోమవారం ఉదయం ఖమ్మం చేరుకున్నారు. ఎంపీ వద్దిరాజు వెంటనే రంగంలోకి దిగి వరద ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. సోమవారం సాయంత్రం ఆయన బాధితుల ఇండ్లకు బీఆర్ఎస్ శ్రేణుల ద్వారా నిత్యావసరాలను అందించారు. ఇందుకు కొనసాగింపుగా ఎంపీ రవిచంద్ర మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున నిత్యావ సరాలను మున్నేరు ముంపునకు గురైన ఖమ్మం, పాలేరు అసెం బ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాలకు పంపించారు .ఎంపీ వద్దిరాజు మంగళవారం ఉదయం ఖమ్మం బురహాన్ పురంలోని తన నివాసం వద్ద నిత్యావసరాల వాహనాలను ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ జేడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, బెల్లం వేణు, తోట వీరభద్రం, గుండ్లపల్లి శేషగిరిరావు, తన అభిమాన గణంతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. నిత్యావసర సరుకులతో కూడిన వాహనాలు కాల్వొడ్డు, బొక్కలగడ్డ, గణేష్ నగర్, వెంకటేశ్వర నగర్, సారథి నగర్, రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలనీ తదితర చోట్ల నిత్యావసరాలను అందించారు.

# అధ్యక్షునిగా క్యాతరాజు రమేష్



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాంబమూర్తి సామూహిక దేవాలయంలో నిర్వహించబోయే గణపతి నవరాత్రుల ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా క్యాతరాజు రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీ సాంబమూర్తి సామూహిక దేవాలయం ప్రధాన అర్చకులు భైరవపట్ల వెంకటేశ్వర శర్మ సమక్షంలో మంగళవారం గ్రామస్తులు సమావేశమై గణప్ తి నవరాత్రుల ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా క్యాతరాజు రమేష్, ఉపా ధ్యక్షులుగా దేవునూరి కుమార్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ అశోక్, కోశాధికారిగా ఎరబాటి మహేంద ర్, సహాయ కార్యదర్శిగా బత్తిని రాజు, కార్యవర్గ సభ్యులుగా వీణవంక నవీన్, క్యాతరాజు రజనీ కాంత్, గుడిమల్ల రమేష్, వీణవంక ప్రసాద్, తంగళ్ళపల్లి వీరబ్రహ్మం, పోలంపల్లి శంకర్, కట్కూరి శ్రీధర్,నీరటిసంతోష్, దేవునూరి అశోక్, అన్నారపు కుమారస్వామి, వనం రాజేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యశాల సమావేశం




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సభ్యత్వ నమోదు కార్యశాల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ కౌన్సిల్ మేంబర్ రచ్చ శ్రీనివాస్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా సభ్యత నమోదు జరుగుతున్న సందర్భంగా ఆత్మకూరు (ఎం) మండల కార్యకర్తలు అందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రతి ఒక బూతులో కనీసం 200 మంది సభ్యులుగా చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటుకూరి అశోక్ గౌడ్, కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి బొబ్బల ఇంద్రారెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు అంబోజు అంజయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు సుధగాని శ్రీహరి గౌడ్, ఎస్సీ మోర్చా మండల పార్టీ అధ్యక్షులు మేడి సాగర్, మండల కార్యదర్శి బూడిది నరసింహ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు లోడి వెంకటయ్య గౌడ్, బీజేవైఎం లోడి మహేష్, బీజేవైఎం మండల అధికార ప్రతినిధి పోనగాని సూర్య ప్రకాష్, బూత్ అధ్యక్షులు కొత్త భాస్కర్ రెడ్డి, వినోద్ గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ




**విశ్వంభర, ఖమ్మం:** బీఆర్ఎస్ ప్రముఖులపై దాడికి పాల్పడిన అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు మదన్ లాల్, మాజీ జేడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితరులు ఖమ్మం నగర పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, గుంటకండ్ల జగదీష్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావులు మున్నేరు ముంపు బాధితులను పరామర్శిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు రాళ్లతో దాడికి దిగడంతో సంతోష్ రెడ్డి అనే బీఆర్ఎస్ నాయకుడు తీవ్రంగా గాయపడడాన్ని సీపీ సునీల్ దత్ కు పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ బీఆర్ఎస్ ప్రముఖులు సీపీకి వినతిపత్రం సమర్పించారు.

# గురుకుల విద్యాలయాల పనివేళల సమయాన్ని శాస్త్రీయంగా నిర్ణయించాలి: బాలల హక్కుల సంక్షేమ సంఘం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో మోటివేషన్ క్లాసుల పేరుతోబ్రహ్మకుమారీస్ సంస్థను గురుకులాల్లోకి తీసుకువచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బీ హెచ్ ఎస్ ఎస్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరుతుందని రాష్ట్ర అధ్యక్షులు డా. గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. ప్రభుత్వం జీ.వో. నెంబర్ 16 పేరుతో గురుకులాలలో విద్యార్థులకు తీవ్ర ఒత్తిడి ఉండేలాగా సమయం మార్చిందని, ఈ సమయం మార్చడం వలన విశ్రాంతి సమయం లేకుండా ఉందని విద్యార్థులు తీవ్ర వత్తిడికి గురయ్యేలా ఉందని, ఇంత ఒత్తిడిని తట్టుకోవాలంటే సైకాలజిస్టులకు ఈ బాధ్యత ఇవ్వాల్సింది పోయి, బ్రహ్మకుమారీస్ లాంటి ఆధ్యాత్మిక సంస్థలకు ఇవ్వడం అనేది అనాలోచిత నిర్ణయం అని, సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి తక్షణమే ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది. నష్టం చేసే ఈ గురుకుల విద్యాలయాల పనివేళల సమయాన్ని శాస్త్రీయంగా మార్చాలని హక్కుల సంక్షేమ సంఘం(బీ హెచ్ ఎస్ ఎస్) రాష్ట్ర అధ్యక్షులు డా. గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ కోరారు.

# చెరువు, వాగులను సందర్శించిన ఎంపీడీవో మాధురి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల ప్రజలు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. మండల పరిధిలోని మంగళపల్లి వాగు, చాకలి కుంట చెరువును సందర్శించారు. మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వాగులు చెరువులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు రాకపోకలు చేయొద్దని సూచనలు చేశారు. గ్రామంలో పర్యటించి కూలిపోయిన ఇండ్లను రిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అనంతరం గ్రామ నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేశారు.

# నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి

## నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి 500 కోట్లు కేటాయించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** నాయి బ్రాహ్మణులు కరోనా వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు వృత్తి నడవక నానా ఇబ్బందులు పడుతున్నామని, మా వృత్తి లోనికి కార్పొరేట్ సెలూన్లు రాకుండా అడ్డుకట్ట వేయాలని నాయి బ్రాహ్మణ సంఘం ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షుడు బొల్లెపల్లి శ్రీహరి అన్నాడు. మాకు జీవో ఇవ్వాలని మా సంక్షేమానికి, అభివృద్ధికి రుణాలు ఇవ్వాలని, ఉచిత విద్యుత్తు బకాయిలను వెంటనే చెల్లించాలని. భారీగా నష్టపోతున్న నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టించి డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని. ప్రభుత్వం మాకు 500 కోట్లు కేటాయించి వృత్తి శిక్షణ ఇవ్వాలని. మహిళలకు బ్యూటీ పార్లర్ శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అప్పటి ప్రభుత్వం ఇస్తున్న లక్ష రూపాయల బీసీ బందు వృత్తిదారులందరికీ ఇవ్వలేదు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం బీసీ బందు ఇవ్వాలని. 50 సంవత్సరాలు నిండిన వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని. ప్రభుత్వం హాస్టల్, హాస్పటల్, పోలీస్ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయాలని, కళ్యాణ కట్టలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం పరిమినెంట్ చేయాలిని, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఆర్టీసీ బస్టాండ్ లో కాంప్లెక్స్ లో బార్బర్ షాపు నెలకొల్పాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్షవర వృత్తిదారులకు ప్రతి ఒక్కరికి ఐడెంటి కార్డు ఇవ్వాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బిక్షం, మండల ప్రధాన కార్యదర్శి బండి నరేష్, కోశాధికారి రాచమల్ల కృష్ణ, టౌన్ అధ్యక్షుడు రాచమల్ల బలరాం, ఏపూరి బుగ్గ రాములు, మునుగోటి అంజయ్య, రాచమల్ల రవి, రాచమల్ల నరసింహ, శ్రీను, నారాయణ, బండి జమ్మయ్య, జంపాల కృష్ణస్వామి, జంపాల బుచ్చయ్య, రాచమల్ల మచ్చ గిరి పాల్గొన్నారు.

# రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

## ఏవోకు వినతిపత్రం అందజేసిన గ్రామ ప్రజలు



**విశ్వంభర చివ్వేంల:** చివ్వేంల మండలం బద్యతండ గ్రామపంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని కేటాయించాలని మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో బద్యతండ గ్రామపంచాయతి ప్రజలు ఏ ఓ కి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేక గ్రామపంచాయతి ప్రజలు త్రీవ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్చార్జి కార్యదర్శి కొన్ని సమయాల్లో అందుబాటులో లేకపోవడం వల్ల సమస్యలను ఎవరికి తెలియజేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో బానోత్ సైదా నాయక్, లింగా నాయక్, చాంప్ల నాయక్, సురేందర్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి రూ. 5000 ల ఆర్థిక సహాయం

**విశ్వంభర, ఆత్మకూరు (ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఇంద్రాల ముత్తయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె హెచ్ ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో మాజీ సర్పంచ్



గనగాని మాధవి మల్లేశం గౌడ్ 5,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగుల యయాతి రాజు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాగుల యాదగిరి, ఉపాధ్యక్షులు కోల రమేష్, కార్యదర్శి మక్తాల నర్సయ్య గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కడకంచి బీరయ్య, మక్తల స్వామి, కోల ఐలయ్య, కోలా ముత్యం,ఎల్లబోయిన కృష్ణ, మక్తల నరసయ్య, యువ నాయకులు గణేష్, కొలిచెలిమి మహేష్, బీఆర్ఎస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షులు ఇంద్రాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్దేశ్వర్‌కు సంఘీభావం

**విశ్వంభర, బషీర్ బాగ్:** కామారెడ్డి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి నారాయణ, ఎస్సీ సంఘాల రాష్ట్ర నాయకులు జంగా అంజయ్యలు అన్నారు. పై అంశాలు అమలు చేయాలని డిమాండ్ తో గత పది రోజులుగా గాంధీ హాస్పిటల్ లో అమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు కు బీసీ నాయకులు కొత్తపల్లి నారాయణ, అంజయ్యలు సంఘీభావం తెలిపారు. కుల గణన వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగనన చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్లు పెంచి, చట్టబద్ధత కల్పించాలని, డిక్లరేషన్ అమలు చేసే వరకు దీక్ష కొనసాగుతుందని సిద్దేశ్వర్లుస్పష్టం చేశారు.

# బాధితులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** ఈరోజు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గుండ్ల కుంట కాలనీలో అకాల భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిన బాధితులను సీపీఎం బృందం కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ పకృతి వైపరీత్యం వల్ల తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసాయి. అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో 30, 35 సంవత్సరాల లో ఎన్నడూ చూడని విధంగా నాలుగు రోజుల నుండి విపరీతమైన ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసాయి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో పేదలు ఇల్లు కట్టుకొని నివసిస్తున్న అవుట్ కట్స్ కాలనీలలో భారీ వర్షాలకు ఇండ్లలోకి నీరు వచ్చి ఇల్లు కూలిపోయాయి. రోడ్లన్నీ జలమయము అయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి వెంటనే కూలిపోయిన బాధితులకు ఇంద్రమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రోడ్లు మరమ్మతు తక్షణమే చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి 50 వేలు నష్టపరిహార చెల్లించాలని డిమాండ్ చేశారు.

# అయ్యప్ప ఆలయంలో శ్రావణ మాస పూజలు



**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణం అయ్యప్ప ఆలయంలో శ్రావణ మాస పూజలు ఆతి వైభవంగా జరిగాయి. ఈ పూజలు శ్రావణం మొదలుకొని శ్రావణ మాసం ముగింపు వరకు అభిషేకాలు రోజు జరిగాయి. మంగళవారం ముగింపు సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ఆకుల పూజ, అన్నపూజలు జరిగాయి. శ్రావణ మాస పూజలలో దాదాపు 500 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ అభిషేకాలను ఆలయ ప్రధాన అర్చకులు కన్నయ్య శాస్త్రి, రాజేష్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, క్యాషియర్ రాములు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఓంకారం, అన్నప్రసాద సేవా సమితి కమిటీ అధ్యక్షులు రాజేందర్, కార్యదర్శి రఘుకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర శ్రీనివాస్, కోశాధికారి మోత్కూరు శ్రీనివాస్, ఆలయ ఉపాధ్యక్షులు చీల శ్రీనివాస్, వీరమల్లి శ్రీనివాస్, గాంధీ, సతీష్ మరియు భక్తులు పాల్గొన్నారు.




విశ్వంభర, హైదరాబాద్: గోవా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ కడియం రామచంద్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్బంగా గోవా సీఎం డా. ప్రమోద్ సావంత్ ని, మరియు బీజేపీ గోవా ప్రెసిడెంట్ సదానంద్ శెట్ తనవాడే, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్, సౌత్ గోవా ఎమ్మెల్యే ఉల్లాస్ టుఎన్కర్ లను రామచంద్రయ్య మర్యాద పూర్వకంగా కలిసారు. వీరితో పాటు బీజేపీ రాష్ట్ర నాయకులు మోడెపు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# అప్రమత్తంగా వ్యవహరించినా నష్టం జరగడం బాధాకరం

### సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, మహబూబాబాద్:** మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అతలాకుతలమైన మహబూబాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. నష్టం జరిగిన ప్రాంతాలను పరిశీలించి బాధిత కుటుంబాలను సీఎం పరామర్శించారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ 28 సెంటిమీటర్ల వర్షం కురిసినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారని,అయినా ప్రాణ నష్టం జరగడం బాధాకరమని మహబూబాబాద్ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. జిల్లా లో 4గురు చనిపోయారని అందులో ఇద్దరు ఈ జిల్లా వాసుల కాగా మరో ఇద్దరు ఖమ్మం జిల్లా వాసులని సీఎం తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. 680 మంది కి పునరావాసం కల్పించామని తెలిపారు. సీతారామతండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి ఈ అభినందనలు తెలిపారు.చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించారు. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి పదివేల సాయం అందిస్తామని, జాతీయ విపత్తు గా ప్రకటించాలని ప్రధాని



కి లేఖ రాశామని తెలిపారు. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధానమంత్రి ని కోరారు.వరదతో చేరిన బురదను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

## ఉత్తమ సేవా అవార్డుకు మహ్మద్ పాషా ఎంపిక



**విశ్వంభర, భూపాలపల్లి:** భుపాలపల్లి జిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని మహ్మద్ పాషా గత కొన్ని సంవత్సరములుగా ఎంతో మంది నిరుపేదలకు ఆయుర్వేద వైద్యంతో చెస్తున్న సేవలను గుర్తించి ఆయనకు ఉత్తమ సేవా అవార్డు అందించారు. కర్నాటక రాష్ట్రం బెంగుళూర్ లోని విజయనగరం శ్రీ ఆది కించినిగిరి మహిళా సంఘం భవనంలో భారత్ సేవా రత్న సమితి ఎస్ కె సాదిక్ ఆద్వర్యంలో ప్రముఖులు సినీ డైరెక్టర్ గుణవంత మంజు, దీసీ సాయబ్ ఇర్మట్, కర్నాటక రాష్ట్ర కనడ భాష అద్యక్షులు కృష్ణ బైరి గౌడ, సుప్రీం కోర్టు లాయర్ కృష్ణ మూర్తి, అనాధ సేవా ట్రస్టు సేవకులు డాక్టర్ మంజన్న గురువుల చేతుల మీదుగా ఈ నెల 27 న ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ఇంకా మున్ముందు ఎంతో మంది నిరుపేదలకు సాయాన్ని అందిస్తూ ప్రజల మన్ననలను పొందాలన్నారు. అవార్డు అందుకున్న పాషా మాట్లాడుతూ గురువుల ఆశీస్సులతో రానున్న కాలంలో ఎంతో మంది నిరుపేదలకు సాయాన్ని అందిస్తూ విద్యలు నేర్పిన గురువుల రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోతు సజన్ లాల్, భరత్ కుమార్, మహబూబ్, రాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ)లో చేరిన తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతుల ఆంజనేయులు, పిల్లి శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో 23 మంది సభ్యులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ)లో చేరారు.స్థానిక తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్ వారికి సభ్యత్వాలను నమోదు చేయించి రశీదులను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ 65 సంవత్సరాల ఉద్యమ వారసత్వ చరిత్ర కలిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘంలో తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ జాయిన్ అవ్వడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ జిల్లా యూనియన్ పక్షాన సాధర స్వాగతం పలికారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్న యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అని చెప్పారు. యూనియన్ ఉద్యమ వారసత్వాన్ని అందిపుచ్చుకొని రాష్ట్ర నాయకత్వం మార్గదర్శకంలో మనమందరం ఐక్యంగా పంచేద్దామని పిలుపునిచ్చారు. తనకి అవకాశం ఇచ్చిన తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కార్యదర్శి ముత్యం, రాష్ట్ర లీగల్ అడ్వైజరి కమిటీ సభ్యులు రేగుల దేవేందర్, పిల్లి శ్రీనివాస్, అందే దేవేందర్, దొంతుల ఆంజనేయులు, శ్రీనివాస్, లింగారెడ్డి, రంగు శ్యామ్, ప్రణయ్, రెడ్డి రాజశేఖర్, రాజు, సాగర్, పరుశరాములు, దినేష్, రాజేష్, సాగర్, ప్రశాంత్, లింగారెడ్డి, మధు, పరశురాములు, శ్రీనాథ్ రావు,యశ్పాల్, యాదగిరి,సంతోష్‌కుమార్,రాజశేఖర్,బాలు,రామచంద్రం,దేవేందర్‌లు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 2 లక్షల 50 వేలు మంజూరు



**విశ్వంభర, నిజామాబాద్:** ఆర్మూర్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కే విజయ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపతున్నారని, స్థానిక కాంగ్రెస్ నాయకు లు ద్వారా విషయం తెలుసుకున్న ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఫోన్‌లో బాధితులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. వెంటనే స్పందించి వారికి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్‌ఓసి ని మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే బాధితురాలి ఆరోగ్య పరిస్థితితుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితురాలి కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి కుటుంబానికిఅండగానిలిచిన వినయ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

## వినాయక విగ్రహాల వివరాలు నమోదు చేసుకోవాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధిలో గల గ్రామాల్లో వినాయక చవితిని లపురస్కరించుకొని వినాయక విగ్రహాలను పెట్టదల్చుకున్న కమిటీలు, ఆర్గనైజేషన్లు మరియు ఇతర యూత్ కమిటీలు మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. మీరు విగ్రహాలను పెట్టదల్చుకున్న స్థలం, విగ్రహం ఎత్తు, నిమజ్జనం స్థలం, కమిటీ మెంబర్లు, ఇతర వివరములు అన్నిటిని మహాదేవపూర్ పోలీస్‌స్టేషన్‌కి వచ్చి నమోదు చేయాలని తెలిపారు.విగ్రహ వివరాలను మీసేవలో లేదా సంబంధిత వెబ్ సైట్లో ఆన్లైన్ చేయవలసి ఉంటుందని, విగ్రహ మండపాల దగ్గర ఎటువంటి డీజేలకు పర్మిషన్ లేదని, ఎవరు ఉపయోగించకూడదని, మైకులు పెట్టాలనుకుంటే పర్మిషన్ తీసుకోవాలని, వర్షాకాలం కావున కరెంటు తీగల కనెక్షన్లకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మండపం దగ్గరఎల్లప్పుడూ ఇద్దరు పెద్దవాళ్లు అందుబాటులో ఉండాలని ,ఎటువంటి గొడవలు లేకుండా శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

# బస్సుల దారి మళ్లింపు

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ డిపో నుండి వివిధ రూట్లో బస్సులను దారి మళ్లింపు చేసి నడపడం జరుగుతున్నది అని డిపో మేనేజర్ ఎం. శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేసినారు. మహబూబాబాద్ జిల్లా ప్రజలు ఇది గమనించాలన్నారు. ఎక్కువగా వర్షాలు కురవడంతో రహదారులు దెబ్బ తినడం వల్ల దారి మళ్లింపు చేసి బస్సులు నడపుతున్నామని అన్నారు. వాటి వివరాలు క్రింది విధంగాఉన్నాయి. కురవి - ఖమ్మం రూట్ నందు ములకలపల్లి వరకు బస్సులు సెటిల్ చేయుచున్నవి. ఖమ్మం వెళ్ళు ప్రయాణికుల సౌకర్యార్థం డోర్నకల్ - లింగాల మీదుగా ఖమ్మం బస్సులు నడపబడుచున్నవి. నెక్కొండ - కేసముద్రం - వరంగల్ రూట్ నందు మహబూబాబాద్ నుండి కేసముద్రం - ఇనుగుర్తి - రెడ్లవాడా - నెక్కొండ మీదుగా వరంగల్‌కు బస్సులు నడపబడుచున్నవి.తొర్రూర్ రూట్ లో మహబూబాబాద్ నుండి కేసముద్రం - ఇనుగుర్తి - నెల్లికుదురు మీదుగా తొర్రూర్ బస్సులు నడపబడుచున్నవి. సూర్యాపేట రూట్ లో ధర్మారం స్టేజి వరకు మహబూబాబాద్ డిపో బస్సులు షటిల్‌గా నడపబడుచున్నవి. మరిపెడ బంగ్లా నుండి సూర్యాపేట వరకు సూర్యాపేట డిపో బస్సులు నడపబడుచున్నవి. మహబూబాబాద్ నుంచి ఇల్లందు మరియుమహబూబాబాద్ నుండి నర్సంపేట - వరంగల్- హనుమకొండ- హైదరాబాద్ రూట్ లో బస్సులు అన్నీ కూడా యధావిధిగా పునః ప్రారంభించబడినవి. ఇట్టి విషయాన్ని ప్రయా ణికులు, ప్రజలు గమనించి సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మహబూబాబాద్ డిపో మేనేజర్ తెలిపారు.

# అర్హులందరికీ రుణమాఫీ

### రుణమాఫీ కాని వారు మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి: జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్




**విశ్వంభర, నారాయణపూర్:** అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ అవుతుందని, రుణమాఫీ కాని వారు మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కుటుంబ నిర్ధారణ కోసం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుండి వస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల నిల్వల వివరాలను నిర్ధారించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులందరూ మండల పరిధిలో ప్రత్యేకంగా చేపట్టిన కుటుంబ నిర్ధారణ కార్యక్రమంలో పాల్గొని తమ దరఖాస్తులను ఇవ్వాల్సిందిగా సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఒక్కో రోజు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ఎవరు అపోహలకు గురి కావద్దని ఆయన సూచించారు. మండల వ్యవసాయ అధికారి పావని, ఏఈఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో 611 దరఖాస్తులు



**విశ్వంభర, హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 611 దరఖాస్తులు అందాయి. ఎస్సీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 149, బీ.సీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 123, మైనారిటీ వెల్ఫేర్ కు సంబంధించి 94, విద్యుత్ శాఖ కు సంబంధించి 57, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 54, ఇతర శాఖలకు సంబంధించి 134 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



**ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో కోదండరాంని సన్మానిస్తున్న దృశ్యం, చిత్రంలో లింబాద్రి చైర్మన్ కౌన్సిలర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ హరగోపాల్, లక్ష్మీనారాయణ రిజిస్టర్ ఓయూ, తుమ్మల పాపిరెడ్డి ఎక్స్ చైర్మన్ కౌన్సిల్ హైయర్ ఎడ్యుకేషన్, నర్సిరెడ్డి ఎమ్మెల్సీ తదితరులు పాల్గొన్నారు.**

## ఎస్సై నగేష్‌ను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, మహబూబాబాద్:** భారీ వర్షం ధాటికి మరిపెడ మండలంలోని సీతారాం తండాను వరద ముంచెత్తింది. సీరోల్ ఎస్సై నగేష్ తన సిబ్బందితో వెళ్ళి ప్రజలను ఎత్తైన ప్రదేశంలోకి తరలించడంతో పాటు ఓ వృద్ధురాలిని స్వయంగా ఎస్సై నగేష్ జోలె కట్టి ఎత్తుకొని వెళ్ళారు. ఎస్సై చూపిన తెగువ, ధైర్య సాహసాలకు ఎస్సై నగేష్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.కూరెళ్ళ విఠలాచార్యకు సన్మానం



**విశ్వంభర,రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో గత 50 సంవత్సరాల నుండి విద్యను బోదిస్తూ, విద్యా సేవ చేస్తూ, గ్రామంలో ఎంతో మందికి మార్గదర్శణం చేస్తున్న స్వాతంత్ర్య సమరయోధులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, వెల్లంకి ప్రాథమిక పాఠశాల స్థాపకులు డా.కూరెళ్ల విఠలాచార్య గ్రంథాలయాన్ని సందర్శించి, వారిని శాలువాతో సన్మానించి, అభినందనలు తెలియజేసి, వారి యోగ క్షేమాలు తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు పూస బాలకిషన్. గురువులపై సిరిపురం కిషోర్ రచించి, పాడిన గేయానికి వీడియో సాంగ్ చిత్రీకరణలో భాగంగా విఠలాచార్యని కలిసి సన్మానించారు.

## హైలెవల్ వంతెనను పరిశీలించిన సీఎం



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం పురుషోత్తమయ గూడెం వద్ద ఆకేరు వాగు ఉధృతికి కొట్టుకుపోయిన హైలెవల్ వంతెనను, పంట పొలాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం ఆప్రాంతం మొత్తం పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. యువ శాస్త్రవేత్త అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ పయనిస్తున్న కారు కొట్టుకుపోయిన ప్రదేశాన్ని ముఖ్య మంత్రి పరిశీలించారు. పునరుద్ధరణ పనులను వెంటనేచేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## మత్తు పదార్థాలు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



**విశ్వంభర, మాడుగుల:** మత్తు పదార్థాలు ఇతర అక్రమ రవాణా ను అరికట్టడానికి మాడుగుల సీఐ జగదీష్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టడానికి మాడుగుల మండలం కోలుకులపల్లి గేటు వద్ద పోలీసులు స్పెషల్ డ్రైవ్ (నాకాబందీ) నిర్వహించి తనిఖీలు చేశారు. మత్తు పదార్థాలు తరలిస్తే కట్టిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే నెంబర్ ప్లేట్లు, హెల్మెట్లు లేని వాహనదారులకు సీఐ జగదీష్ కౌన్సిలింగ్ ఇచ్చారు.

## ఈనెల 8న గుండె చికిత్సా శిబిరం




**విశ్వంభర, కల్వకుర్తి:** ఈనెల 8 ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని ప్రశాంత్ క్లినిక్ నందు మేడి కవర్ ఆసుపత్రి హైదరాబాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండె చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, క్యాంప్ చైర్మన్ పసుల వెంకటరెడ్డి, క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. గుండె సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి తెలిపారు. గుండె చికిత్స శిబిరంలో ఈసీజీ, టు డి ఏకో పరీక్షలు ఉచితముగా నిర్వహిస్తున్నట్లు క్యాంప్ చైర్మన్ వెంకటరెడ్డి క్లబ్ పీఆర్వో పాషా తెలిపారు. లయన్ డయాగ్నటిక్ సెంటర్ కల్వకుర్తి యందు ఈనెల 4, 5 తేదీలలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు బ్లడ్ శాంపిల్ తీసుకుంటామని తెలిపారు. అవసరం ఉన్నవారు పడిగడుపున రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, క్యాంప్ చైర్మన్ వెంకటరెడ్డి, క్లబ్ పీఆర్ఓ పాషా తెలిపారు.

## అమీన్‌పూర్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలు



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజక వర్గం అమీన్ పూర్ మండలంలోని ఐలాపూర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 119 భూమి కోర్టు పరిధిలో ఉండగా కొందరు వెంచర్ చేసి ప్లాట్లు చేస్తున్నారని ఫిర్యాదులు అందుకున్న హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు నడుమ అక్రమ వెంచర్లలలో ప్లాట్లతో పాటు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అనంతరం అమీన్ పూర్ లోని బంధం కొమ్ము లోని సర్వే నంబర్ 462 లోని ప్రభుత్వ భూమిలో ప్యూజియన్ ప్రైవేటు స్కూల్ లో హైడ్రా సహకారంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వ భూమిలోని 15 గుంటల్లో నిర్మించిన స్కూల్ గేటు, రూమ్స్, స్టేడియాన్ని జేసీబీలతో హైడ్రా అధికారులు దగ్గరుండి కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహశీల్దార్ రాధా తెలిపారు. రెవెన్యూఅధికారులు,మున్సిపల్‌సిబ్బంది,టౌన్‌ప్లానర్లు,సిఐలు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అపరాజిత బిల్లు చారిత్రాత్మకం

## బెంగాల్ అసెంబ్లీలో మాట్లాడిన మమతా బెనర్జీ

**కోల్‌కతా::** పశ్చిమ బెంగాల్ లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. తీవ్ర విమర్శల నేపథ్యంలో.. అసెంబ్లీలో మంగళవారం బెంగాల్ ప్రభుత్వం హత్యాచార నిరోధక బిల్లును ప్రవేశపెట్టింది. 'అపరాజిత విమెన్ అండ్ చైల్డ్ బిల్లు' పేరిట దానిని తీసుకువచ్చింది. ఇందుకోసం ప్రత్యేక సెష న్ను నిర్వహిస్తోంది. చర్చ అనంతరం దీనికి ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో మాట్లాడారు. ఈ బిల్లు చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. "సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నాం. దోషులకు మరణ శిక్ష విధించాలని కోరుతున్నాం. ఈ రోజు మేం ప్రవేశపెట్టిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయాలని విపక్షాలు అడగాలి. ఆ తర్వాత దానిని అమలు చేసే బాధ్యత మాది. ఈ బిల్లు ద్వారా కేంద్రచట్టంలోని లోపాలను సరిద్దిద్దే ప్రయత్నం చేస్తున్నాం. సత్వర విచారణ, బాధితులకు న్యాయం లభించడం ఈ బిల్లు లక్ష్యం. ఒకసారి ఈ బిల్లు పాస్ అయితే.. ప్రత్యేక అపరాజిత టాస్క్ ఫో ర్స్ను ఏర్పాటుచేస్తాం. అత్యాచారం వంటి దారుణాలు మానవా ళికి శాపాలు. ఇలాంటి ఘోరాలు జరగకుండా సామాజిక సంస్కర ణలు రావాలి. యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై అసాధారణ స్థాయిలో నేరాలు జరుగుతున్నాయి. ఉన్నావ్, హాథ్రస్ కేసుల్లో న్యాయం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కానీ బెంగాల్ లో మహిళలకు కోర్టుల్లో న్యాయం లభిస్తుంది. మీవలే నేనూ ప్రధాని, హోంమంత్రిపై నినాదాలు చేస్తే ఎలా ఉం టుంది..? మహిళ రక్షణ కోసం సమర్థవంతమైన చట్టాలు తీసు కురాలేని ముఖ్యమంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేయండి" అని పేర్కొన్నారు. మృతురాలికి నివాళి అర్పించారు. హత్యాచార ఘటనపై మమత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తోన్న విపక్షాలు.. మద్దతు ఇచ్చాయి. హడావుడిగా తీసుకురావడాన్ని ప్రశ్నించిన భాజపా.. కొన్ని సవరణలు సూచించింది. అయితే ఆమోదం లభించలేదు. దానిపై భాజపా నిరసన వ్యక్తం చేయ డంతో సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. అలాగే మమ త తన ప్రసంగంలో మోదీ, అమిత్ షా పేర్లను ప్రస్తావిం చడంపైనా అభ్యంతరం వ్యక్తమైంది. ఇదిలా ఉంటే.. కోల్కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యా చార ఘటన దర్యాప్తులో సీబీఐ వేగం పెంచింది. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ను అరెస్టు చేసింది. ఆసుపత్రి ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలకు సంబంధించి ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ కేసులో ఇంతకు ముందు పోలీస్ పౌర వాలంటీర్ సంజయ్ రాన్ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

# ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ?

■ కేసీఆర్ ఫామ్ హౌస్ లో ... కేటీఆర్ ఇగ్లాండ్‌లో ఉన్నారు ■ ఇంత విపత్తు వచ్చినా వారు ఎందుకు పట్టించుకోవడం లేదు? ■ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్




**విశ్వంభర హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం వర్షాలతో అతలాకుతలం అయిన సమయంలో బాధ్యత గల ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ ఉన్నాడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియా తో మాట్లాడుతూ ప్రజలకు భరోసా, సర్కారుకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యాడని విమర్శించారు. రాజకీయాలను పక్కన పెట్టి సాయం చేయాల్సిన సోయి ఆయనకు లేదా అని ప్రశ్నించారు . కేసీఆర్ ఏ ఫామ్ హౌస్ లో పడకున్నారో తెలుసుకునే పనిలో ప్రజలు ఉన్నారని అన్నారు. మొన్నటి వరకూ కవిత బెయిల్ కోసం పనిచేశారని, ఇప్పుడు తండ్రి ఫామ్ హౌస్‌లో ఉంటే, కేటీఆర్ ఇంగ్లాండ్ లో రిలాక్స్ అవుతున్నారని పేర్కొన్నారు. ఇంగ్లాండ్ లో విహార యాత్రలో ఉండి సోషల్ మీడియా లో ట్వీట్ చేస్తున్నారు. సోషల్ రెస్పాన్సబులిటీ మరిచి సోషల్ ట్వీట్ లు పెడుతున్నారని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వరద బాధితులను ఆదుకోవడానికి రోడ్డు మార్గంలో వెళ్లి పర్యటిస్తూ పరిస్థితిని అంచనా వేస్తున్నారని తెలిపారు . నాలుగు రోజులుగా సీఎం, మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. కేటీఆర్‌కు హెలికాప్టర్ల సోకులు తప్ప మరేం లేవని,పసలేని ట్వీట్లు పెడ్తూ విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు వరద సాయం చేస్తానని చెప్పి అన్ని ఎగ్గొట్టాడని విమర్శించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా కట్టకుండా రైతులను మోసం చేసిన మొనగాడు కేసీఆర్ అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రాజ్ భవన్ ముందున్న ఎంఎస్ ముక్తా నీటమునిగినా కేసీఆర్ గడపదాటి బయటికి రాలేదన్నారు. కేంద్రంతో కూడా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడి ఆర్థిక సాయం కోరారని.. కొన్ని పేపర్లలో వాస్తవాలకు దూరంగా వార్తలు వస్తున్నాయన్నారు. ఏపీ లో ప్రతిపక్ష నేతగా జగన్ సమర్ధ పాత్ర పోషిస్తున్నారని అన్నారు. బాధ్యత గల ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజలకు అండగా నిలబడ్డారని అన్నారు. ఇక్కడ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారని అన్నారు. సంపాదించుకున్న సొమ్ముని దాచుకునే పనిలో బీఆర్ఎస్ నేతలున్నారని ఆరోపించారు. సర్కార్ కు సపోర్ట్ చేయాలని సూచించారు. సిటీ ఆఫ్ లేక్స్ అంటేనే హైదరాబాద్ అని.. హైడ్రాకు తాము పూర్తి మద్దతు పలుకుతున్నామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## నష్టం వివరాలను వారాంతంలోగా పంపాలి
## అధికారులను ఆదేశించిన సీఎస్ శాంతికుమారి



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్ ఓ డీ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ డా.జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ రావు, రవీ గుప్తా, వికాస్ రాజ్, అర్వింద్ కుమార్, ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, నవీన్ మిట్టల్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, రఘునందన్ రావు, లోకేష్ కుమార్, రోనాల్డ్ రోస్, ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ఇప్పటికీ అనేక జిల్లాల్లో వరదలు, వానలు తగ్గుముఖం పట్టలేదని అన్నారు. జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్ర స్థాయికి పంపి, వివరాలతో సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫోర్స్ లను ఏర్పాటు చేయడానికి కావాల్సిన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలు వెంటనే సమర్పించాలని అన్నారు. ఈ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీహెచ్ ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారాఫ్ అలీ, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి లు కూడా పాల్గొన్నారు.

## వరద ముంపు నివారణకు చర్యలు
### నగరంలో పలు ప్రాంతాలను సందర్శించిన కమిషనర్



**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏ ప్రాంతం కూడా వరద ముంపునకు గురికాకుండా నివారణ చర్యల్లో భాగంగా నాలా పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి జోనల్, అదనపు కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కూకట్ పల్లి జోన్ లో జీహెచ్ఎంసి కమిషనర్ పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మైసమ్మ చెరువు, ఐ డీఎల్ చెరువు, సఫ్దర్ నగర్ లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సఫ్దర్ నగర్ లో వరద ముంపుకు గురైన ప్రాంతాన్ని పర్యటించి ఆమె ప్రజలతో మాట్లాడారు. ఇక ముందు వరద ముంపుకు గురి కాకుండా నాలా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. ముంపునకు గురైన కాలనీ వాసులకు సురక్షిత త్రాగు నీరు సరఫరా చేయాలని, దోమల నివారణకు ఏ ఎల్ ఓ, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చోట హెల్త్ క్యాంపు లు ఏర్పాటు చేయాలని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు ఆమె సూచించారు. ఐ డి ఎల్, మైసమ్మ చెరువుల వద్ద గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని సౌక ర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, యస్ ఈ చిన రెడ్డి, డి సి లు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి
### మూడు రోజులు గడువు విధించిన సర్కారు
### అధికారులకు మున్సిపల్ సీఎస్ దాన కిషోర్ ఆదేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులన్నింటి సుందరీకరణ, అభివృద్ధి పనుల కోసం కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన అధికారులకు కేవలం మూడు రోజుల గడువు విధిస్తూ యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని సూచించారు. గ్రేటర్ పరిధిలో ని చెరువుల అభివృద్ధి, సుందరీకరణపై చీఫ్ సెక్రటరీ మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్లతో మున్సిపల్ చీఫ్ సెక్రటరీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ, అభివృద్ధి, పర్యావరణ ప్రాతిపదిన సుందరీకరణ పనులు చేసే విధివిధానాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. చార్మినార్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ , ఖైరతాబాద్ జోన్ లలో ఒక్కో జోన్ కు ఐదు చొప్పున కనీసం 50 చెరువులను గుర్తించి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో సుందరీకరణ, అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. నగరంలోని బిల్డర్ కమ్యూనిటీ, ప్రముఖ కార్పొరేట్ కంపెనీలో సంప్రదింపులు జరిపి, చెరువుల అభివృద్ధికి ఆయా సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు ఇచ్చేలా, వాటిని దత్తతకు తీసుకుని అభివృద్ధి చేసేలా, సుందరీకరణ పనులు చేపట్టేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. సుందరీకరణలో భాగంగా చెరువుల కట్టలను బలోపేతం చేయడం, లోనికి వచ్చే, బయటకు వెళ్ళే నీటి కాల్వలను శుభ్రం చేయాలన్నారు. చెరువులపై వాకింగ్ ట్రాక్ లు, పూల మొక్కలు, , ఆర్నమెంట్ మొక్కలు పెంచడం, చుట్టూ గార్డెనింగ్ అభివృద్ధి , బండ్ పార్కులను అభివృద్ధి చేయాలన్నారు .ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా లేక్ లను అన్ని విధాలుగా అభివృద్ధి చేయటమే ప్రధాన లక్ష్యంగా అధికారులు విధులు నిర్వర్తించాలని దాన కిషోర్ సూచించారు.

## జీహెచ్ఎంసీ యూనియన్ అఫిలియేన్ రద్దు
### అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఐఎన్టీయూసీ
### సొంత గూటికి చేరుతున్న పలు యూనియన్ల నేతలు



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని కోటి న్నర మంది జనాభాకు అత్యవసర సేవలందించే జీహెచ్ఎంసీలో అనూహ్య పరిణామం చోటుచేసు కుంది. రాష్ట్రంలో అధికార మార్పి డి జరగటంతో జీహెచ్ఎంసీ యూ నియన్లకు గుర్తింపు ఎన్నికలు ఎపుడైనా జరగవచ్చునంటూ సందడి చేస్తున్న ఆయా యూనియ న్ల నేతలు ఇటీవలే భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూని యన్‌ను వీడి, ప్రత్యేక యూనియన్ ను స్థాపించుకున్నారు. ఇందుకు ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎన్టీయూసీ) అఫిలియేషన్ తీసుకుని జీహెచ్ఎంసీ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ పేరిట ప్రత్యేక యూనియన్ స్థాపించుకున్నామని అప్పట్లో ప్రకటించారు. కానీ అదే ఎన్టీయూసీ ఇప్పటికే జీహెచ్ఎంసీలో ఆదిల్ షరీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్న మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కు సైతం అఫిలియేషన్ ఇచ్చింది. ఇపుడు తాజాగా జాతీయ ఎన్టీయూసీ జీహెచ్ఎంసీ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్‌కు గతంలో ఇచ్చిన అఫిలియేషన్‌ను ఉపసంహ రించు కుంటు న్నట్లు ప్రకటన జారీ చేసింది. అంతటితో ఆగని ఐఎన్టీయూసీ తాము దశాబ్దాల క్రితం అఫి లియేషన్ ఇచ్చిన మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కే తమ అఫిలియేషన్ కొనసా గుతుందంటూ ఐఎన్టీయూసీ హెడ్ క్వార్టర్ నుంచి కార్యదర్శి పీజే రాజు పేరిట విడుదల చేసిన ప్రకటన కొత్తగా యూనియన్ ఏర్పాటు చేసుకున్న నేతలను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. అప్పట్లో కొత్తగా ఈ యూనియన్ ను ఏర్పాటు చేసిన సదరు నేతపై బీఎంఈయూ యూనియన్ ను వదిలి వచ్చిన నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. అంతటితో ఆగని నేతలు గతంలో తాము వీడిని బీఎంఈయూ గూటికి తిరిగి చేరారు. ఆ యూనియన్ నేతల సమక్షంలో మంగళవారం నాడే బీఎంఈయూలో చేరినట్లు ఆ యూనియన్ నేత అష్రఫ్ తెలిపారు. ఇప్పటికే ఐఎన్టీయూసీ అఫిలియేషన్ పొందిన మున్సిపల్ సహకార్ యూనియన్ సైతం జరగనున్న యూనియన్ గుర్తింపు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పలువు రు నేతలను తమ యూనియన్ లో చేర్చుకుంటుంది. ఇపుడు మరి కొందరు నేతలు తాజాగా బీఎంఈయూలో చేరటంతో జీహెచ్ఎంసీలో యూనియన్ గుర్తింపు ఎన్నికల వేడి రాజుకుంటోంది. నేతలు ఊహించిన విధంగా త్వరలోనే ప్రభుత్వం యూనియన్లకు గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తుందా? నిర్వహిస్తే ఏ యూనియన్ గెలుస్తుందన్నది ఇపుడు హాట్ టాపిక్ గా మారింది.

## రైతుల సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ నియమించిన సుప్రీం కోర్టు

**ఢిల్లీ:** పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత సహా పలు డిమాండ్లతో శంభు సరిహద్దు వద్ద నిరవధిక నిరసనను కొనసాగిస్తున్న రైతుల సమస్యల పరిష్కారానికి సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. అయిదుగురు సభ్యుల కమిటీకి పంజాబ్, హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ చైర్పర్సన్గా వ్యవహరించనున్నారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. అత్యున్నత స్థాయి కమిటీ ఈ వారంలోనే సమావేశం కావాలని, రైతుల న్యాయ బద్ధమైన సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించింది. పంజాబ్, హరియాణా రాష్ట్రాల మధ్య శంభు సరిహద్దు వద్ద రహదారిపై అడ్డుగా పెట్టిన ట్రాక్టర్లు, ట్రాలీలను తక్షణమే తొలగించేలా రైతులను ఒప్పించాలని తెలిపింది. ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తమ సూచనలను కమిటీకి తెలియజేయవచ్చని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు నియమించిన కమిటీలో విశ్రాంత ఐపీఎస్ అధికారి బి.ఎస్.సంధు, మొహాలీ నివాసి దేవిందర్ శర్మ, ప్రొఫెసర్ రంజిత్ సింగ్ ఘుమన్, వ్యవసాయ ఆర్థికవేత్త డా.సుఖ్పాల్ సింగ్ సభ్యులుగా ఉన్నారు. హరియాణా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్పై తదుపరి విచారణను అక్టోబరు 14వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. ఈ లోగా ఉన్నత స్థాయి కమిటీ తమ మధ్యంతర నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

## ఘనంగా శేష దత్తగిరి ఆశ్రమంలో శ్రావణ మాసం పూజలు



**విశ్వంభర, ముషీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బర్దీపూర్ గ్రామంలో శేష దత్తగిరి ఆశ్రమంలో శ్రావణ మాసం చివరి రోజు సోమవారం కావడంతో శేష దత్తగిరి ఆశ్రమంలో శివుడికి రుద్రాభిషేకం, గణపతి హోమ కార్యక్రమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ హోమియోపతి వైద్యులు, సికింద్రాబాద్ కంటెస్ట్ బీఎస్పీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ దండెపు బసవానందం ముఖ్య అతిథిగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శేష దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి 108 వైశ్య శిఖమని అవధూత గిరి మహారాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ దండేపు బసవానందం మాట్లాడుతూ.. దత్తగిరి ఆశ్రమ హోమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారు ఆకాంక్షించారు.

## పురుగుల మందు తాగి వృద్ధురాలు మృతి



**విశ్వంభర, చేగుంట:** మాసాయిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు గౌరగల్ల పెంటమ్మ 63 జీవితంపై విరక్తి చెంది ఆగస్టు 31 రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఇంట్లో ఒక్కతే ఒంటరిగా ఉన్న సమయంలో పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్ సికింద్రాబాద్ తీసుకొని వెళ్లగా చికిత్స పొందుతూ సెప్టెంబర్ మూడున చనిపోయింది. ఆమె కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## దేవాలయం చుట్టూ ఫెన్సింగ్‌ను వేయించిన సామాజిక సేవకుడు అయిత పరంజ్యోతి



**విశ్వంభర, చేగుంట :** చేగుంట మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయంలో కోతులు రాకుండా దేవాలయం చుట్టూ ఫెన్సింగ్‌ను వేయించిన సామాజిక సేవకుడు అయిత పరంజ్యోతి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయం చుట్టూ కోతుల బెడద ఉంటుందని భక్తులకు ఇబ్బంది కలుగుతుందని గమనించి సుమారు 35 వేల రూపాయల ఖర్చుతో దేవాలయం చుట్టూ కోతులు లోపలికి రాకుండా ఫెన్సింగ్ వేయించానని వారు తెలిపారు. భక్తులు ప్రశాంతంగా పూజ లు చేసుకోవచ్చని వారన్నారు. ఈ కార్యక్రమంలో అయిత పరంజ్యోతి దంపతులు తొడుపు నూరి నగేష్‌గుప్తా,వంజరి శ్రీనివాస్, మాదాసు శశికాంత్ గౌడ్, హనుమాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు అండగా ఉంటాం

విశ్వంభర, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రధానంగా పదకొండు జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుకిషన్?రెడ్డి తెలిపారు. వర్షాలు, వరదల వల్ల చాలావరకూ ఆస్తులు కోల్పోవడం, పంట నష్టం వాటిల్లిందని వివరించారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా కేంద్ర బృందాలు వచ్చి సమీక్షిస్తాయని వివరించారు. అవసరమైతే ప్రధాన మంత్రి పర్యటిస్తారని, జాతీయ విపత్తు ఎక్కడా ప్రకటించడం లేదన్నారు. నిధులు ఇచ్చి సహాయ, సహకారాలు అందిస్తున్నప్పుడు జాతీయ విపత్తుగా ప్రకటించడం ఎందుకని కిషన్?రెడ్డి ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం వద్ద రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ రూ.1345 కోట్లు ఉందని, ప్రస్తుతం ఆ నిధులను ఉపయోగించి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. అది అయిపోతే, తాత్కాలికంగా కేంద్రం నుంచి నిధులు విడుదల చేస్తామన్నారు. విపత్కర సమయంలో తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అండగా ఉంటుందని కేంద్రమంత్రి, కిషన్? రెడ్డి స్పష్టం చేశారు. వర్షాలు, వరదల వల్ల ఆస్తులు కోల్పోవడం, పంట నష్టం భారీగా వాటిల్లిందని కేంద్రమంత్రి కిషన్?రెడ్డి తెలిపారు. ఇప్పటికే వరద ప్రభావంపై ప్రధాని మోదీ, అమిత్ షా రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడారని వివరించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించినట్లు వెల్లడించారు. ఏపీ, తెలంగాణలో నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు కేంద్రం సమీక్ష చేస్తుందన్న ఆయన, ఇప్పటికే దెబ్బతిన్న జాతీయ రహదారులను మరమ్మత్తు చేయాలని ప్రధాని కార్యాలయం ఆదేశించిందని తెలిపారు.మృతుల కుటుంబాలకు రూ.3 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఎక్స్?గ్రేషియా ఇస్తుందన్న ఆయన, రాష్ట్ర సర్కార్? రూ.5 లక్షలు ప్రకటించటం పట్ల సందేహం వెలిబుచ్చారు. కేంద్రం ఇచ్చే ఫండ్?ను కలుపుకుని ముఖ్యమంత్రి రూ.5 లక్షలు ప్రకటించారేమో మరి తెలియదని వ్యాఖ్యానించారు. అంటువ్యాధులు ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**లెక్కలే తీయకుండా సాయం అడిగితే ఎలా?**

మరోవైపు ప్రెస్?మీట్ అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. వరద సాయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. అధికారులు వరద ముంపు గ్రామాల్లోకి వెళ్లి లెక్కలే తీయనప్పుడు ఏ ప్రాతిపదికన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5వేల కోట్ల సాయం అడుగుతున్నారని ప్రశ్నించారు. ఔటర్ రింగురోడ్డు భూముల ద్వారా ప్రభుత్వాన్ని నడపాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని కిషన్?రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో సభ్యత్వ నమోదును 7వ తేదీన మధ్యాహ్నం ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి నియా మకం జాతీయ నాయకత్వం చేతిలో ఉంటుందని, ఎప్పుడూ ప్రకటిస్తుంది, ఎవ్వరినీ ప్రకటిస్తుందనేది తెలియదన్నారు.

**పరేడ్ మైదానంలో విమోచన దినోత్సవం**

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలు ప్రతి సంవత్సరం జరిగేలా కేంద్రం నిర్ణయిం తీసుకుందని కిషన్?రెడ్డి ప్రకటించారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా రాబోతున్నట్లు వివరించారు. మజ్లిస్?కు భయపడి గత ప్రభుత్వాలు హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించలేకపోయాయని, బీజేపీ అధికారంలోకి వచ్చాక సెప్టెంబర్ 17న గ్రామ పంచాయతీపైన జాతీయ జెండా ఎగురవేస్తామని కేంద్రమంత్రి ధీమా వ్యక్తం చేశారు.



## మున్నేరు ఉద్ధృతి.. కొట్టుకుపోయిన లింగాల వంతెన

**విశ్వంభర, పెనుగంచిప్రోలు :** మునేరు వరద ఉద్ధృతికి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట వద్ద లింగాల వంతెన కొట్టుకుపోయింది. కిలోమీటర్ మేర ఉన్న వంతెనపై పలుచోట్ల భారీ గండ్లు ఏర్పడ్డాయి. వరద నీటిలో కాంక్రీట్ స్లాబులూ కొట్టుకుపోయిన పరిస్థితి నెలకొంది. వరద తాకిడికి రెండుచోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. మరమ్మతులకూ పనికిరాదని స్థానికులు అంటున్నారు. జగ్గయ్యపేట నుంచి ఖమ్మం ప్రాంతానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి లింగాల వంతెన పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు. గత కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఎన్నడూ లేని విధంగా మునేరు ఉగ్రరూపం దాల్చింది. దీంతో నందిగామ మండలం ఐతవరం వద్ద విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై వరద ఉద్ధృతంగా ప్రవహించి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు మునేరుకు భారీగా వరద చేరుతుంది. లోతట్టు ప్రాంతావాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## సీఎం సహాయ నిధికి సాయం చేయండి
**- ముఖ్యమంత్రి చంద్రబాబు**



**విశ్వంభర, విజయవాడ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో విజయవాడ నగరం అతలాకుతలం అయిన విషయం తెలిసిందే. పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తడంతో లక్షలాది మంది నిరాశ్రయులుగా మారారు. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో సహాయక చర్యలు ఇప్పుడిప్పుడు ఊపందుకుంటున్నాయి. ఈ కార్యక్రమాలను మరింత ముమ్మరంగా కొనసాగించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కీలకమైన ప్రకటన చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు మంచి మనసుతో ముందుకు రావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎవరికి తోచిన విధంగా వారు సీఎం సహాయనిధికి సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంధంగా ముందుకు రావాలని ప్రభుత్వం ఈ మేరకు పిలుపునిచ్చింది. బాధితులకు ఏ రూపంలోనైనా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛందంగా ఆహారం ఇవ్వదలచిన దాతల కోసం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రత్యేక పాయింట్‌ను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఆహారం అందించే దాతలను కోఆర్డినేట్ చేసుకునే బాధ్యతను ఐఏఎస్ అధికారి మనజీర్‌కు సీఎం చంద్రబాబు అప్పగించారు. స్వచ్ఛంధంగా ముందుకొచ్చే దాతలకు మరింత సమాచారం అందించేందుకు 79067 96105 నెంబర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుతో టీడీపీ సీనియర్ నేత బుద్ధా వెంకన్న సీఎం సహాయ నిధికి రూ.5 లక్షలు విరాళంగా అందించారు. మరోవైపు స్వచ్ఛంధ సేవా సంస్థలు కూడా ముఖ్యమంత్రి పిలుపుతో ముందుకు వచ్చాయి. విజయవాడ వరద బాధితులకు సాయం చేసేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకొచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లు జై భారత్ క్షీరా ఆక్వా సంఘం తరఫున 2000, కాస్మో క్లబ్ తరఫున 3000 ఆహార పొట్లాలు విజయవాడకు తరలిస్తున్నారు. ఏపీ డిప్యూటీ కలెక్టర్లు సంఘం వరద బాధితులకు కోటి రూపాయలు విరాళం ఇచ్చింది. తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్టు అసోసియేషన్ తెలిపింది.

## వరద ప్రభావిత ప్రాంతాలపై ఏపీ ప్రభుత్వం ఫోకస్
**- మంత్రి నారాయణ**

**విశ్వంభర, విజయవాడ :** ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉద్ధృతి క్రమంగా తగ్గుతోంది. నిన్న 11 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, నేడు అది 7 లక్షలకు తగ్గింది. అటు విజయవాడ నగరంలోనూ పరిస్థితులు కొద్దిగా మెరుగయ్యాయి. ఈ నేపథ్యంలో, మంత్రి నారాయణ మాట్లాడుతూ, విజయవాడలో వరద ఉద్ధృతి తగ్గుతోందన్నారు. వరద బాధితులందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇవాళ 8.5 లక్షల భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశామని తెలిపారు. అదే సంఖ్యలో అల్పాహార పొట్లాలను కూడా అందజేశామని మంత్రి నారాయణ వివరించారు. విజయవాడలో కాలువల్లో పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయిందని, వరద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లపై భారీగా మట్టి, ఇసుక చేరిందని, యుద్ధ ప్రాతిపదికపై ఆ మట్టి, ఇసుక తొలగిస్తామని వెల్లడించారు. నీరు తగ్గాక, రోడ్లపై మురుగు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రేపటి నుంచే ఈ కార్యాచరణ మొదలవుతుందని చెప్పారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఒక్కో డివిజన్ ను ఒక్కో మున్సిపల్ కమిషనర్ కు అప్పగించామని, ఒక్కో సచివాలయానికి ఒక్కో ప్రత్యేక అధికారి ఉంటారని వివరించారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కోసం 10 వేల మంది కార్మికులు కావాలని నారాయణ పేర్కొన్నారు. వరద నీరు తగ్గాక అగ్నిమాపక శాఖ ట్యాంకర్లతో రోడ్లు శుభ్రం చేస్తామని చెప్పారు. అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, ఫాగింగ్ పనులు చేపడతామని... వైద్య శాఖతో కలిసి మెడికల్ క్యాంపులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు.



# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు

## అధికారులైనా..టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులైనా చర్యలు తప్పవు : మీడియాతో సీఎం చంద్రబాబు

**విశ్వంభర, విజయవాడ :** వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం మాట్లాడారు. నగరంలో డివిజన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్‌ను నియమించామని చెప్పారు. 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయక చర్యల్లో ఉన్నారన్నారు. పది జిల్లాల నుంచి ఆహారం సమకూర్చామని.. బాధితులకు మూడు పూటలా అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలని స్పష్టం చేశారు. కాగా, నిన్న జక్కంపూడి ప్రాంతంలో నియమించిన ఓ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిసిందని.. ఆయన్ను సస్పెండ్ చేసానని అన్నారు. ఈ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తన పార్టీలోని మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా తీసేస్తానని హెచ్చరించారు. "వరదలతో పేదల బాధలు వర్ణణాతీతం. కొన్ని ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వచ్చాయి. దీంతో వారందరికీ బాధ, భయం ఉంటుంది. అధికారులంతా మానవతా దృక్పథంతో పనిచేయాలి. అందుతున్న సహాయంపై ఐవీఆర్ఎస్ నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రాంతాలకు ఇంకా ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహారం అందని బాధితుల నంబర్లు అధికారులకు పంపిస్తున్నాం. ఇబ్బందులపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి. నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నా. అధికారులకు రెండు రోజులుగా చెప్పాం.. ఇప్పుడు సరిగా పనిచేయలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు. మీనమేషాలు లెక్కించడం సరికాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులూ ఒడ్డి సేవ చేయాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కష్ట సమయంలో బాధితులకు అండగా నిలవాలి. ఏవిధంగా సహకారం అందించగలిగితే అలా చేయూత అందించాలి. ఆర్థికంగా, నిత్యావసరాలు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం.. ఇలా ఏది వీలైతే అది మీ శక్తిమేర చేయాలి. ప్రభుత్వం తరఫున చేయాల్సిందంతా చేస్తాం అని భరోసా ఇచ్చారు.



**అందరూ భాగస్వాములు కండి..**

"ప్రభుత్వం నుంచి మేం చేయాల్సినవన్నీ చేస్తాం. సమాజం కూడా మాకు సాయం చేయాలి. మీకు కుదిరితే బాధితులకు వండి పెట్టి క్యారేజ్ పంపడమో.. వారికి ఆర్థిక సాయం చేయడమో ఇలా ఏది తోస్తే అది చేయండి. సమాజం బాగుంటేనే మనం బాగుంటాం. అంతేకానీ.. ఎవడో చనిపోతే మనకేంటి అనుకోకండి. రేపు మనం చనిపోతే మన శవాన్ని ఎవరు మోసుకెళ్తాడు? ఇలాంటి ఆలోచన తప్పు. మన ఇంట్లో మనిషి చనిపోతే ఎలా ఉంటుందో అలా బాధితులకు అండగా నిలవండి. మీడియా వర్గాలు కూడా తప్పుడు వార్తలు రాయకండి. ఇక జగన్ విషయానికొస్తే.. నిన్న ఐదు నిమిషాలు షో చేసాడు. కనీసం ఒక ఫుడ్ ప్యాకెట్ ఇచ్చిన పాపాన పోలేదు" అని చంద్రబాబు అన్నారు..

**ఏపీపై వైసీపీ కుట్రలు...**

ప్రకాశం బ్యారేజీ పిల్లర్ ను బోట్లు ఢీకొన్నాయి అని తెలీగానే ముందు ఇది ప్రమాదం అనుకున్నా. కానీ చాలా మంది అనుమానం ఉంది అంటున్నారు. దాంతో నాక్కూడా అనుమానం మొదలైంది. లేకపోతే వరుసగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆహారం కలుషితం కావడం ఏంటి? హాస్టల్‌లో కెమెరాలేంటి? ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొనడం ఏంటి? ఇవన్నీ ఇప్పుడే జరుగుతున్నాయి. నాకు అనుమానించడం తప్ప మరో దారి కనిపించడంలేదు. బాబాయిని హత్య చేసి నారాసుర చరిత్ర అని రాసినోడు ఎలాంటి కుట్రలకైనా పాల్పడతాడు. కాబట్టి ఏ నియోజకవర్గానికి చెందిన మంత్రి, ఎమ్మెల్యే తమ ప్రాంతాల్లో విజిలెన్స్ పెంచుకోవాలి. ఇలాంటి ఘటనలు జరగనివ్వకూడదు. ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకుంటూ ఉండాలి "" అని తెలిపారు. అనంతరం సీఎం చంద్రబాబు సితార సెంటర్ కు వెళ్లారు. విజయవాడ పర్యటనలో భాగంగా సితార సెంటర్‌కు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. జేసీబీ ఎక్కి వరద కాలనీల్లో పరిస్థితి పరిశీలించారు. ఆహారం అందుతుందా..? లేదా..? అని బాధితులను అడిగి తెలుసుకుంటున్నారు. స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా అధికారులపై చర్యలు ఉంటాయని చంద్రబాబు తెలిపారు.

# ప్రకాశం బ్యారేజీ పటిష్ఠంగా ఉంది

**కన్నయ్య నాయుడు**

**విశ్వంభర, అమరావతి :** ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో వరద వచ్చింది. దాదాపు 125 ఏళ్ల తర్వాత ఇంత స్థాయిలో వరద నీరు రావడం ఇదే మొదటిసారి. ఈ సమయంలోనే ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహానికి బోటు అడ్డం పడటంతో 69వ గేటు విరిగిపోయింది. దీంతో మిగిలిన గేట్లు కూడా విరిగిపోతాయేమోనన్న ఆందోళన ఇంజినీరింగ్ నిపుణుల్లో వ్యక్తమవుతుంది. దీంతో వెంటనే చంద్రబాబు స్పందించారు..గేట్లను అమర్చడంలో ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్యను పిలిపించారు. ఆయన ఇవాళ ప్రకాశం బ్యారేజ్ ను పరిశీలించారు. బ్యారేజీ గేట్ల నిర్వహణ కోసం నిర్మించిన అయిస్ట్ బ్రిడ్జి ఎక్కి పరిశీలించారు. రెండు గేట్లు స్వల్పంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. బ్యారేజీ పటిష్టంగా ఉన్నట్లు నిర్ధారించారు. గేట్లు ఎత్తడం, మూయడం కోసం ఏర్పాటు చేసిన మెకానిజం, మోటార్ యంత్రాల పనితీరును



తెలుసుకున్నారు.

బోట్ల తొలగింపునకు కాకినాడ నుంచి నిపుణులు తొలుత గేట్లకు అడ్డంగా ఉన్న బోట్లను తొలగించాలని అధికారులకు కన్నయ్యనాయుడు సూచించారు. వాటిని తొలగించాకే మరమ్మతులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. బ్యారేజీలో వరద 5 లక్షల క్యూసెక్కులకు తగ్గాకే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మరోవైపు దీనికి సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతను జలవనరుల శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమా చేపట్టారు. బోట్లు తొలగించేందుకు కాకినాడ నుంచి నిపుణులను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనంతరం కన్నయ్య మీడియాతో మాట్లాడుతూ, బోట్లు ఢీకొట్టడం వల్ల ప్రకాశం బ్యారేజీకి నష్టం లేదని ప్రాజెక్టు గేట్ల నిపుణుడు తెలిపారు. గేట్లు, గోడలు అన్నీ పటిష్టంగానే ఉన్నాయని, కేవలం కౌంటర్ వెయిట్ లు దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న వాటిని తొలగించి కొత్త కౌంటర్ వెయిట్ ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. బ్యారేజీ గేట్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బోట్లు తొలగించవచ్చని పేర్కొన్నారు. నీటిమట్టం 8 లక్షల క్యూసెక్కులకు చేరిన తర్వాత పనులు ప్రారంభిస్తామని కన్నయ్య నాయుడు తెలిపారు. కౌంటర్ వెయిట్స్ ని వర్క్ షాపులో తయారు చేసి ఇక్కడకు తెచ్చి అమర్చుతామని చెప్పారు. కొత్త కౌంటర్ వెయిట్స్ ని అమర్చడానికి 15 రోజులు సమయం పడుతుందని తెలిపారు.

## ముంబయి నటి జత్వానీ కట్టడికి జగన్, సజ్జన్ జిందాల్ ప్లాన్ చేశారు

**వైఎస్ షర్మిల**





**విశ్వంభర, కడప :** నటి కాదంబరి జెత్వానీని కట్టడి చేయడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్, పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్ కలిసి ప్లాన్ చేశారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. యాక్టింగ్ ఫీల్డ్ లోకి వచ్చి ఎదగాలనుకున్న జెత్వానీని మానసికంగా వేధించారని చెప్పారు. ఆమె కేసు పెట్టబోతే నిర్బంధించి వేధించారని అన్నారు. ఉన్నత కుటుంబానికి చెందిన జెత్వానీని ఇక్కడకు తీసుకొచ్చి అరెస్ట్ చేశారని మండిపడ్డారు. జగన్‌కు తెలియకుండానే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వ్యవహరిస్తారా? అని షర్మిల ప్రశ్నించారు. ఇద్దరు కుమార్తెలు ఉన్న జగన్... జెత్వానీకి జరుగుతున్న అన్యాయంపై ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు.

సజ్జన్ జిందాల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని జగన్ గొప్పగా చెప్పుకున్నారని గుర్తు చేశారు. జిందాల్ కు కోట్ల రూపాయల విలువైన ఆస్తులను జగన్ ఎందుకు కట్టబెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. జెత్వానీకి అండగా ఉండి, ఆమె కోసం పోరాడేందుకు తాను సిద్ధమని చెప్పారు.

కడప స్టీల్ ప్లాంట్ పై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని షర్మిల విమర్శించారు. గత ఏడాది సీఎం హోదాలో స్టీల్ ప్లాంట్ కు జగన్ శంకుస్థాపన చేసినా... ఆ తర్వాత దాన్ని పట్టించుకోలేదని దుయ్యబట్టారు.

గుడ్లవల్లేరు కాలేజీలో సీక్రెట్ కెమెరాలు అనేది ఫేక్ ప్రచారం అని తాము భావిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తరపున తమ టీమ్స్ వెళ్లి సర్వే చేస్తే అంతా ఫేక్ అని తేలిందని వెల్లడించారు. కెమెరాలు పెట్టినట్టు ఎవరైనా నిజాలు బయటపెడితే బాధితుల తరపున పోరాడతామని చెప్పారు.

## ఎమ్మెల్యే ,కలెక్టర్‌కు బీజెవైయం వినతి

**విశ్వంభర,చండూరు:** స్థానిక మునిసిపాలిటీ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణం చేపడుతున్నా వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఆపాలి అని భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ ,మునుగోడు శాసన సభ్యులు రాజగోపాల్ రెడ్డి లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేర్ల గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టడం వల్ల విద్యార్థులకు,చండూరు యువతకి క్రీడలు ఆడుకోవడానికి గ్రౌండ్ సౌకర్యం ఉండదు అని అన్నారు. ఎలాంటి క్రీడ పోటీలు నిర్వహించలని అనుకున్నా కూడా చండూరు మునిసిపాలిటీ లోని ప్రభుత్వ పాఠశాలలో తప్ప గ్రౌండ్ సౌకర్యం ఎక్కడ లేదని అన్నారు.

కావున తక్షణమే ట్యాంక్ నిర్మాణాన్ని వేరే చోట నిర్మాణం చేపట్టాలి అని డిమాండ్ చేసారు. లేనిచో బీజేవైయం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో BJYM జిల్లా అధికార ప్రతినిధి సిరాసవాడ నాగరాజు, BJYM పట్టణ అధ్యక్షులు దోటి శివ, ఉపేంద్ర , సాయి చంద్,అంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ముమ్మరంగా తాగునీటి నాణ్యతా పరీక్షలు

**బస్తీల్లో పర్యటించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** మహా నగరంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రెండో రోజు మంగళవారం ఆయన హఫీజ్ పేట్ లోని సాయినగర్, యూత్ కాలనీ, మజీద్ బండ, ఇజ్జత్ నగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాలు కురవటంతో ప్రజలకెలాంటి నీరు సరఫరా అవుతుందన్న విషయంపై ఆయన ఆరా తీశారు. బుధవారం నుంచి మరిన్ని వాటర్ శ్యాంపిల్స్ సేకరించి, వాటిని పరీక్షించిన తర్వాతే తాగు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రజలకు సరఫరా చేయాల్సిన నీటిని మూడెంచెలుగా క్లోరినేషన్ చేయనున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు

ముంపునకు గురైన ప్రాంతాల్లో మంచి నీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మ్యాన్ హోళ్లు ఉప్పొంగితే వెంటనే పూడిక తీయాలని వివరించారు. వాటి నుంచి తీసిన వ్యర్థాల్ని (సిల్ట్) వెంటనే అక్కడ్నుంచి తొలగించాలని ఆదేశించారు.

**తాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

వర్షాల వల్ల తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. తాగునీటి నాణ్యతపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియను అవలంభిస్తున్నామని చెప్పారు.

**బస్తీల్లో క్లోరిన్ బిల్లలు పంపిణీ**

నగరంలోని బస్తీలు, వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నీటి సరఫరాపై జలమండలి మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోందని ఎండీ పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకుగానూ ప్రజలు ఇళ్లలో నిల్వ చేసుకున్న నీటి నాణ్యతపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు. నిల్వ చేసిన నీటిని శుద్ధి చేసుకోవడం కోసం ప్రజలకు క్లోరిన్ బిళ్లలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాలు, బస్తీలు, లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటివరకు జలమండలి 8.80 లక్షల క్లోరిన్ బిళ్లలను పంపిణీ చేసిందని పేర్కొన్నారు.

**అందుబాటులో కస్టమర్ కేర్**

నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఎక్కడైనా మ్యాన్హోల్ మూత ధ్వంసం అయినా, తెరిచి ఉంచినట్లు తెలిస్తే జలమండలి కస్టమర్ కేర్కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే కలుషిత నీరు మరియు ఇతర సమస్యలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి ఫిర్యాదు చేయాలని కోరారు.

**త్వరతగతిన సమస్యలు పరిష్కరించాలి : జలమండలి ఈడీ**

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జలమండలి ఎక్స్‌క్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున డివిజన్ 3 పరిధిలోని విజయ నగర్ కాలనీ సెక్షన్ ఆఫీస్ ను సందర్శించారు. సెక్షన్ ఆఫీస్ లో రికార్డులను పరిశీలించినానంతరం ఈడీ మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా అన్ని చర్యలూ చేపట్టాలని, రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భనలో జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్ భార్గవ, జీఎమ్ సుబ్రహ్మణ్యం డీజీఎం, మేనేజర్లు పాల్గొన్నారు.



## విజయవాడ సహాయక చర్యల్లో అపశ్రుతి వరద నీటిలో కొట్టుకుపోయిన లైన్‌మెన్

**విశ్వంభర, విజయవాడ :** భారీ వర్షాలు, వరద నీటి ప్రవాహంతో విజయవాడ నగరవాసులు ఉలిక్కిపడ్డారు. సోమవారం నుంచి వరద ప్రభావం తగ్గుతోందని, విజయవాడ వాసులకు ఏ ఇబ్బంది లేదని మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత చెప్పారు. అయితే భారీ వర్షాలతో విజయవాడలో పలు కాలనీలు అంధకారంలోకి వెళ్లగా, నేడు విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచారు. కానీ విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. విజయవాడలో సహాయక చర్యల్లో వజ్రాల కోటేశ్వరరావు అనే లైన్ మెన్ పాల్గొన్నాడు. ఒక్కసారిగా వరదనీటిలో కోటేశ్వరరావు కొట్టుకుపోయాడు. విద్యుత్ పునరుద్ధరణ పనులకు వచ్చి లైన్ మెన్ మృతిచెందడంపై ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లైన్ మన్ భార్యకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు.

## వైసీపీ నేతల వల్లే బుడమేరుకు గండ్లు

**పల్లా శ్రీనివాస్**

**విశ్వంభర, అమరావతి :** వైసీపీ నేతల అక్రమ ఇసుక దందా వలనే బుడమేరుకు గండ్లు పడి కోతకు గురైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్ విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లు బుడమేరును గాలికొదిలేసిన జగన్.. నేడు ప్రభుత్వంపై బురద చల్లేందుకు వచ్చాడని మండిపడ్డారు. విపత్తుల సమయంలో జగన్ ఏనాడు బాధితుల పక్షాన నిలబడలేదన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో సాయంత్రం 5 తరువాత ఒక్క రోజు కూడా జగన్ బయటకు రాలేదన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రజాహితం కోరాలని తెలిపారు. జగన్ రెడ్డి ఫేక్ ప్రచారం మానుకోవాలని... విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలన్నారు. చంద్రబాబు ఇంటి కోసం బుడమేరు నీరు డైవర్ట్ చేశారని చెప్పడం జగన్ తెలివితక్కువతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద బాధితుల కోసం నిలబడిన భగీరదుడు చంద్రబాబు అని అన్నారు. బాధితుల కోసం యంత్రాంగాన్ని, నేతలను, హెలికాఫ్టర్లు, బోట్లు, డ్రోన్లతో యుద్ధప్రాతిపదికన సాహాయ సహకారాలను అందించడం చంద్రబాబు వలనే సాధ్యమైందన్నారు. అమరావతిపై తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం చేయడంలో చంద్రబాబు పాత్ర కీలకం కానుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## గోదావరిలో పెరుగుతున్న నీటి మట్టం

**విశ్వంభర , ఖమ్మం:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. నిన్న 26 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం ఉదయానికి 30 అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల శ్రీరామ్ సాగర్, కాళేశ్వరం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద నీటి వల్ల భద్రాచలం వద్ద ఇంకా నీటిమట్టం పెరుగుతుందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలుపుతున్నారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో వరద నీరు స్నాన ఘట్టాల మెట్ల వరకు చేరి ప్రవహిస్తోంది. మంగళవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 40 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు. మహారాష్ట్ర నుంచి భారీగా వరద ఉత్తర తెలంగాణను ముంచెత్తుతోంది. రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద త్రివేణి సంగమం వరద ప్రవాహం పెరుగుతోంది. తెలంగాణ మహారాష్ట్ర మధ్య ఉన్న బ్రిడ్జిని ఆనుకుని ప్రవాహం కొనసాగుతోంది. దాంతో అధికారులు మహారాష్ట్రకు రాకపోకలు నిలిపివేశారు.

## మైసిగండి ఆలయ హుండీ లెక్కింపు

**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద మంగళవారం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలి పంతూ, జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ టి శేఖర్ ఆలయ ఈవో స్నేహలత పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 80 రోజులకుగాను హుండీ ఆదాయం రూ. 15,40,206 లభించినట్లు ఈవో స్నేహలత తెలిపారు. హుండీ ఆదాయం డబ్బును ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేసి భక్తుల సౌకర్యాల కోసం ఖర్చు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆర్.పి భాస్కర్, అరుణ్, ప్రధాన అర్చకుడు యాదగిరి, సిబ్బంది బోడ్యనాయక్, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, నర్సింహా గౌడ్, మహేష్‌గౌడ్, పత్య నాయక్, కృష్ణయ్య, బి బి చారి, డిస్ శ్రీను, హర్షవర్ధన్ ఆలయ సిబ్బంది మరియు కెనరా బ్యాంకు లక్ష్మి నారాయణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# లార్డ్స్ వేదికగా ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్



**విశ్వంభర, క్రీడావిభాగం:** 2025 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కు షెడ్యూల్ ఖరారైంది. ఈ కీలకమైన పోరుకు ప్రతిష్ఠాత్మక లండన్ లార్డ్స్ మైదానం వేదిక కానుంది. ఈ ఫైనల్ ఫైట్ 2025 జూన్ 11 నుంచి 15 దాకా జరగనున్నట్లు ఐసీసీ తాజాగా వెల్లడించింది. జూన్ 16ను రిజర్వ్ డే గా ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

**రిజర్వ్ డే కూడా**

'2025 జూన్ 11-15 వ తేదీ వరకు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ జరగనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ఫైనల్‌కు లార్డ్స్ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది. అవసరం అయితే జూన్ 16 రిజర్వ్ డేగా అందుబాటులో ఉంటుంది' అని ఐసీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ లార్డ్స్ వేదికగా జరగడం ఇదే తొలిసారి. సౌతాంప్టన్ వేదికగా తొలి డబ్ల్యూటీసీ ఫైనల్ (2021) జరిగింది. అందులో న్యూజిలాండ్ విజేతగా నిలిచింది. ఇక 2023 డబ్ల్యూటీసీ ఫైనల్ ఓవల్ వేదికగా జరిగింది. ఈ ఫైనల్‌లో ఆస్ట్రేలియా గెలుపొందింది. అయితే ఈ రెండు ఎడిషన్స్‌లో ఫైనల్స్‌కు చేరిన భారత్ ఛాంపియన్‌గా నిలువలేకపోయింది. దీంతో ఈ సారైనా ఫైనల్ చేరి డబ్ల్యూటీసీ గద దక్కించుకోవాలని రోహిత్ సేన ఉత్సాహంగా ఉంది.

**పాయింట్ల పట్టికలో టాప్‌లో భారత్**


2023 ఐసీసీ వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ విజేత ఆస్ట్రేలియా కంటే పాయింట్ల పట్టికలో భారత్ ముందంజలో ఉంది. 9 మ్యాచ్‌ల్లో ఆరు గెలిచి భారత్ 68.51 విన్నింగ్ పర్సంట్‌తో తొలి స్థానంలో నిలిచింది. 12 మ్యాచ్‌ల్లో ఎనిమిది గెలుపొంది, ఆసీస్ 62.50 విన్నింగ్ పర్సంటేజ్ నమోదు చేసి రెండో స్థానంలో కొనసాగుతోంది. అలాగే న్యూజిలాండ్ ఆరు మ్యాచుల్లో మూడు గెలిచి, మూడు ఓడిపోయింది. 50 శాతం పాయింట్ పర్సెంటేజీతో నిలిచింది. నాలుగో స్థానంలో బంగ్లాదేశ్, ఐదో ప్లేస్ లో ఇంగ్లాండ్ నిలిచింది. చివరి నాలుగు స్థానాల్లో దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్, వెస్టిండీస్ జట్లు నిలిచాయి. 'ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ క్రికెట్ క్యాలెండర్‌లో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈవెంట్‌లలో ఒకటిగా మారింది. 2025 ఎడిషన్ కోసం తేదీలను ప్రకటించినందుకు మేము సంతోషిస్తున్నాము. ఇది ప్రపంచ క్రికెట్ అభిమానులకు ఆనందాన్నిచ్చే విషయం. ఐటీసీ ఫైనల్ మ్యాచ్ టికెట్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. కాబట్టి అభిమానులు ఇప్పుడే వారి ఆసక్తిని నమోదు చేసుకోమని కోరుతున్నాను' అని ఐసీసీ సీఈఓ అల్లర్డిస్ తెలిపారు.

# భారత్ ఖాతాలో మరో స్వర్ణం

**విశ్వంభర, క్రీడావిభాగం:**

పారిస్ వేదికగా జరుగుతున్న పారాలింపిక్స్‌లో భారత అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. సోమవారం ఏకంగా ఏడు పతకాలు సాధించారు. జావెలిన్ త్రో ఈవెంట్‌లో సుమిత్ అంటిల్ వరుసగా రెండోసారి గోల్డ్ మెడల్ సాధించి, చరిత్ర సృష్టించాడు. ఈటెను 70.59 మీటర్లు త్రో చేసి పారాలింపిక్స్‌లో సరికొత్త రికార్డు క్రియేట్ చేశాడు.

## జావెలిన్ త్రోలో సుమిత్‌కు గోల్డ్ మెడల్




**రెండో ప్రయత్నంలో రికార్డ్ త్రో**

హర్యానాకు చెందిన సుమిత్, రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 70.59 మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు. మొదటి త్రోలో ఈటెను 69.11 మీటర్లు విసిరాడు. మూడో ప్రయత్నంలో 66.66 మీటర్లు, ఐదో ప్రయత్నంలో 69.04 మీటర్లు, చివరి ప్రయత్నంలో 66.57 మీటర్ల దూరం విసిరాడు. నాలుగో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు.

**దులన్‌కు రజతం, మిచల్‌కు కాంస్యం**

సుమిత్ పారాలింపిక్స్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో 70.59 మీటర్లతో హిస్టరీ క్రియేట్ చేశాడు. మరే ఇతర అథ్లెట్లు ఈ రికార్డు దరిదాపుల్లోనే లేరు. శ్రీలంక అథ్లెట్ కోడితువాక్కు దులన్ 67.03 మీటర్లు త్రో విసిరి రజతం కైవసం చేసుకోగా, ఆస్ట్రేలియాకు చెందిన మిచల్ బురియన్ తన సీజన్ బెస్ట్ త్రో 64.89 మీటర్లతో కాంస్యం సాధించాడు. ఈ ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ సంజయ్ సందీర్ సర్గర్, మెడల్ సాధించలేక నిరాశపర్చాడు. అతడు కేవలం 58.03 మీటర్లు మాత్రమే జావెలిన్ విసిరి 7వ స్థానంలో నిలిచాడు.

**సుమిత్ ట్రాక్ రికార్డ్స్**

సుమిత్ అంటిల్‌కు పారాలింపిక్స్‌లో ఇది రెండో స్వర్ణం. అంతకు ముందు టోక్యో పారాలింపిక్స్‌లో ఎఫ్64 విభాగంలో 68.55 మీటర్లు జావెలిన్ విసిరి ప్రపంచ రికార్డుతో స్వర్ణం సాధించాడు. గతేడాది ప్రపంచ పారా ఛాంపియన్‌షిప్‌లో సైతం గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ఆసియా పారా గేమ్స్‌లో 73.29 మీటర్ల త్రోతో తన రికార్డ్‌ను తానే బద్దలు కొట్టాడు.

**భారత్ పతాకధారిగా**

పారాలింపిక్స్‌లో వరుసగా రెండోసారి పసిడి పతకం సాధించడంతో సుమిత్ అంటిల్‌ను పారా-జావెలిన్ ఈవెంట్లలో నీరజ్ చోప్రాగా అభివర్ణిస్తున్నారు. అతడు పారాలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, ఆసియా పారా గేమ్స్‌లో ఒక స్వర్ణం సాధించి భారత పతకాన్ని రెపరెపలాడించాడు. ఈ క్రమంలో పారిస్ పారాలింపిక్స్‌లో భారతదేశానికి పతాకధారిగా అరుదైన గౌరవం దక్కించుకున్నాడు.

**బ్యాడ్మింటన్‌లో నితేష్ కుమార్‌కు పసిడి**

పారిస్ పారాలింపిక్స్‌లో సోమవారం భారత్ ఖాతాలో ఏడు పతకాలు చేరాయి. జావెలిన్ త్రోలో సుమిత్ స్వర్ణం సాధించగా, బ్యాడ్మింటన్‌లో హర్యానాకు చెందిన నితేష్ కుమార్ సైతం గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో భారతకు చెందిన సుహాస్, తులసిమతి షట్లర్స్ ఫైనల్‌లో ఓడి సిల్వర్ మెడల్స్ సాధించారు. డిస్కస్ త్రో ఈవెంట్‌లో యోగేష్ సైతం రజతం సాధించాడు. ఆర్చరీలో శీతల్- రాకేష్ జోడి కాంస్య పతకం కైవసం చేసుకుంది. మరో షట్లర్ మనీషా కూడా కాంస్య పతకం సాధించింది. పారిస్ పారాలింపిక్స్ పతకాల పట్టికలో ప్రస్తుతం భారత్ 15వ స్థానంలో కొనసాగుతోంది. మూడు స్వర్ణాలు, ఐదు రజతాలు, ఆరు కాంస్య పతకాలతో మొత్తంగా భారత్ ఖాతాలో 14 పతకాలు చేరాయి.

# ఆ తప్పిదమే మా కొంప ముంచింది

## పాక్ కెప్టెన్ షాన్ మసూద్




**విశ్వంభర, క్రీడావిభాగం:** పాకిస్థాన్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది బంగ్లాదేశ్. రావల్పిండి వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదటి టెస్టులో బంగ్లా పది వికెట్ల తేడాతో నెగ్గిన విషయం తెలిసిందే. సుదీర్ఘ ఫార్మాట్‌లో పాక్‌పై బంగ్లాకు ఇదే తొలి సిరీస్ విజయం కావడం గమనార్హం. కాగా.. సిరీస్ ఓటమిపై పాక్ కెప్టెన్ షాన్ మసూద్ స్పందించాడు. ఈ ఓటమి తీవ్ర నిరాశపరిచిందని చెప్పుకొచ్చాడు. రెండో టెస్టు మ్యాచులో ఓటమి అనంతరం షాన్ మసూద్ మాట్లాడుతూ.. ఈ ఓటమి తీవ్ర నిరాశపరిచిందన్నాడు. ఈ ఓటమి నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సి ఉందన్నాడు. హోం సీజన్ కోసం ఎంతో ఉత్సాహంగా ఎదరుచూశామని ఆస్ట్రేలియా తరహా కథనే పునరావృతమైందన్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో మెరుగైన క్రికెట్ ఆడాలని నేర్చుకున్నామని, అయితే.. సొంత గడ్డపై స్థాయికి తగ్గ క్రికెట్ ఆడలేకపోయామన్నాడు. ఈ విషయం పై ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందన్నాడు. తన కెప్టెన్సీలో ఇలా జరగడం నాలుగో సారి అని, సుధీర్ఘ ఫార్మాట్‌లో ఆటగాళ్లు మరింత ఫిట్‌గా ఉండడం ముఖ్యమన్నాడు. ఇక తొలి టెస్టులో నలుగురు పేసర్లతో బరిలోకి దిగడాన్ని మరోసారి సమర్థించుకున్నాడు. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌ల్లో 274 పరుగులు మంచి స్కోరు. అయితే.. తొలి ఇన్నింగ్స్‌ల్లో 26 పరుగులకే 6 వికెట్లు తీసిన సమయంలో బంగ్లాదేశ్‌ను ఒత్తిడిలోకి నెట్టడంలో విఫలం అయినట్లు తెలిపాడు. లిటన్ దాస్ అద్భుతంగా ఆడాడని అన్నాడు.




# బంగ్లాదేశ్ చరిత్రాత్మక విజయం

**విశ్వంభర, క్రీడావిభాగం:** టెస్టు క్రికెట్‌లో సంచలనం నమోదైంది. పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్ చారిత్రక విజయాన్ని సాధించింది. పాక్‌పై బంగ్లా తొలిసారి టెస్టు సిరీస్‌ను గెలిచింది. రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. రావల్పిండి వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆతిథ్య జట్టు పాకిస్థాన్‌ను బంగ్లాదేశ్ ఆరు వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. మరోవైపు సొంతగడ్డపై పాకిస్థాన్ వరుసగా పదో టెస్టులో విజయం సాధించలేకపోయింది. వర్షం కారణంగా లేదా బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఓటమి నుంచి తప్పించుకోవాలనుకున్న పాక్‌కు నిరాశే మిగిలింది. కాగా,ఓవర్‌నైట్ స్కోరు 42/0తో అయిదో రోజు 185 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన బంగ్లాదేశ్ నాలుగు వికెట్లు కోల్పోయి విజయాన్ని సాధించింది. ముష్ఫికర్ రహీమ్ (22 నాటౌట్, 51 బంతుల్లో, 1 ఫోర్), షకిబ్ అల్ హసన్ (21 నాటౌట్, 43 బంతుల్లో, 1 ఫోర్, 1 సిక్సర్) జట్టును విజయతీరాలకు చేర్చారు. ఓపెనర్ జకీర్ హసన్ (40; 39 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. ఇవాళ ఆట ఆరంభమైన కాసేపటికే బంగ్లా ఓపెనర్లను కోల్పోయింది. కానీ ఒత్తిడికి లోనుకాకుండా బంగ్లాదేశ్ బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి జట్టును గెలిపించారు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 274 స్కోరు చేసింది. సయిమ్ అయుబ్ (58; 110 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. మెహదీ హసన్ అయిదు వికెట్లతో సత్తాచాటాడు. అనంతరం బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 262 పరుగులకు ఆలౌటైంది. 26/6తో కష్టాల్లో ఉన్న జట్టును లిటన్ దాస్ (138; 228 బంతుల్లో, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) గొప్పగా ఆదుకున్నాడు. పాక్ బౌలర్లలో ఖురమ్ ఆరు వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 172 పరుగులకే కుప్పకూలింది. అఘా సల్మాన్ (47 నాటౌట్) టాప్ స్కోరర్. హసన్ మహ్మద్ అయిదు వికెట్లు తీశాడు. 185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లా నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది.

### అందుకే టీమిండియా కోచ్ పదవికి దూరంగా ఉన్నా


# వీరేంద్ర సెహ్వాగ్

**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమ్‌ఇండియా హెచ్ కోచ్‌గా బాధ్యతలు చేపడితే మరోసారి కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుందన్నాడు. ఏడాది పాటు భారత జట్టుతో పాటు ప్రయాణాలు చేయాల్సి ఉంటుందన్నాడు. ఆటగాడిగా ఆడిన సమయంలో 15 ఏళ్ల పాటు కుటుంబానికి దూరంగా ఉన్నానని చెప్పాడు. హెడ్ కోచ్ పదవి చేపడితే మరోసారి ఇదే రిపీట్ అవుతుందన్నాడు. తనకు 14, 16 ఏళ్ల వయసు గల పిల్లలు ఉన్నారని, వారికి తన అవసరం ఉందన్నాడు. ఇద్దరూ క్రికెట్ ఆడుతున్నారన్నాడు. ఒకరు ఆఫ్ స్పిన్నర్ కాగా మరొకరు ఓపెనింగ్ బ్యాటర్. వారికి తాను ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉందన్నాడు. వారితో మరింత సమయం గడపాలని అనుకుంటున్నట్లు చెప్పడు. ఒకవేళ తాను టీమ్‌ఇండియా హెడ్ కోచ్‌గా వెళితే వాళ్లని ట్రైనింగ్ చేయడం కష్టమవుతాదని, అదే ఐపీఎల్ కోచ్‌గా అయితే పిల్లలతో ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉందని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. 15 ఏళ్ల పాటు భారత జట్టుకు ఆడిన వీరేంద్ర సెహ్వాగ్ టీమ్‌ఇండియా తరుపున 104 టెస్టులు, 251 వన్డేలు, 19 టీ20లు ఆడాడు. 2015లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అనంతరం కామెంటేటర్‌గా, పంజాబ్ కింగ్స్ మెంటార్‌గా, సపోర్ట్ స్టాఫ్, డైరెక్టర్ ఆఫ్ ది క్రికెటర్‌గా 2018 వరకు బాధ్యతలు నిర్వర్తించాడు. కాగా.. 2017లో టీమ్‌ఇండియా హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే.. అప్పటి క్రికెట్ అడ్వైజరీ కమిటీ రవిశాస్త్రిని కోచ్‌గా నియమించింది. ఆ తరువాత మరోసారి హెడ్‌కోచ్ పదవికి సెహ్వాగ్ దరఖాస్తు చేసుకోలేదు.



# ఒక్కసారి ఇన్వెస్ట్ చేస్తే చాలు

## నెలకు రూ.20వేలు రాబడి.. వృద్ధుల కోసం



**విశ్వంభర, బిజినెస్:** పదవీవిరమణ తర్వాత సుఖమయ జీవనం కావాలనుకునే వారు తప్పనిసరిగా ముందుగానే ఆర్థిక ప్రణాళికను తయారు చేసుకోవాలి. ఉద్యోగం చేస్తున్న సమయం నుంచి సరైన విధంగా పొదుపు పాటిస్తే వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి. సౌకర్యవంతమైన జీవితాన్ని గడపడానికి ఆస్కారం ఉంటుంది. అదే విధంగా పదవీవిరమణ చేసిన తర్వాత అందుబాటులో డబ్బును మంచి పథకాలలో పెట్టుబడి పెట్టడం వల్ల అధిక రాబడిని పొందడంతో పాటు నిరంతరాయ రాబడిని ఆశించివచ్చు. అలాంటి స్కీమ్లలో సీనియర్ సిటిజెన్ సేవింగ్స్ స్కీమ్ ఒకటి. ఇది వృద్ధులకు అందుబాటులో ఉన్న బెస్ట్ స్కీమ్లలో ఒకటి. అధిక రాబడిని ఇస్తుంది. ఈ నేపథ్యంలో ఈ ఖాతాను ఎలా తెరవాలి. రాబడి ఎలా ఉంటుంది? అర్హతలు ఏమిటి? పూర్తి వివరాలు ..

**ఇలా ప్రారంభించొచ్చు..**

సీనియర్ సిటిజెన్ సేవింగ్స్ స్కీమ్ ముఖ్యాంశాలలో ఒకటి, ప్రజలు తమ పెట్టుబడిని రూ. 1,000తో ప్రారంభించవచ్చు. దీనిని పోస్ట్ ఆఫీసులో ప్రారంభించే అవకాశం ఉంటుంది. పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ భారతదేశంలోని సీనియర్ సిటిజన్లకు సురక్షితమైన పెట్టుబడి ఎంపిక. ఇది సాధారణ ఆదాయ ప్రవాహాన్ని అందిస్తుంది. వారి పదవీ విరమణ సంవత్సరాలలో వారి ఆర్థిక అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది.

**పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ అర్హత..**

పోస్ట్ ఆఫీస్ ఎస్సీఎస్ఎస్ అనేది ఖాతాను తెరిచిన తేదీలో 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తుల కోసం లేదా 55 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తి, 60 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వ్యక్తులు తెరవవచ్చు. అంతే కాకుండా, డిఫెన్స్ సర్వీసెస్‌లోని రిటైర్డ్ సిబ్బంది (సివిలియన్ డిఫెన్స్ ఉద్యోగులను మినహాయించి) ఇతర షరతుల ఆధారంగా మాత్రమే 50 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత ఖాతాను తెరవగలరు. ఈ పథకం డిపాజిటర్‌ను వ్యక్తిగతంగా లేదా జీవిత భాగస్వామితో కలిసి ఖాతా తెరవడానికి అనుమతిస్తుంది. కానీ ఒకే ఒక్క షరతు ఏమిటంటే, జాయింట్ ఖాతాలో మొత్తం డిపాజిట్ మొత్తం మొదటి ఖాతాదారుడికు మాత్రమే ఆపాదించబడుతుంది.

**ఎలా దరఖాస్తు చేయాలంటే..**

సీనియర్ సిటిజన్లు బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఎస్సీఎస్ఎస్ ఖాతాను తెరవవచ్చు. ఖాతా తెరవడానికి, సీనియర్ సిటిజన్లు కనీసం రూ. 1,000 డిపాజిట్ చేయాలి. గరిష్టంగా రూ. 30 లక్షలు డిపాజిట్ చేసుకోవచ్చు. రూ. 30 లక్షలకు మించని రూ. 1,000 గుణిజాల్లో ఖాతాలో ఒక డిపాజిట్ మాత్రమే ఉండవచ్చు. ఖాతా నుంచి బహుళ ఉపసంహరణలు అనుమతించబడవు.

**రాబడి ఇలా ఉంటుంది..**

ప్రస్తుతం, ఈ పథకంలో 8.2 శాతం వార్షిక వడ్డీని ప్రభుత్వం అందిస్తోంది. కాబట్టి, ఒక వ్యక్తి దాదాపు రూ. 30 లక్షల పెట్టుబడి పెడితే, వారికి రూ. 2.46 లక్షల వార్షిక వడ్డీ లభిస్తుంది. అంటే నెలకు దాదాపు రూ. 20,000 వరకూ అందుతుంది. ఇది వృద్ధులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

# ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్

**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్, ఏటా బిగ్ బిలియన్ డేస్ సేల్ ఈవెంట్‌ను నిర్వహిస్తోంది. ఫెస్టివల్ సీజన్‌లో ప్రారంభమయ్యే ఈ సేల్‌లో గృహోపకరణాల నుంచి ఎలక్ట్రానిక్స్ వస్తువుల వరకు అన్ని రకాల ప్రొడక్స్‌పై అదిరిపోయే ఆఫర్లు, డిస్కౌంట్లతో బెస్ట్ డీల్స్ అందిస్తుంది. ఈ వారం వినాయక చవితి నుంచి ఇండియాలో ఫెస్టివల్ సీజన్ ప్రారంభం కానుంది. దీంతో ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు ఈ ఏడాది బిగ్ బిలియన్ డేస్ సేల్ ఈవెంట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ స్పెషల్ సెల్ ఎప్పుడు స్టార్ట్ అవుతుందో తెలుసుకుందాం. సెప్టెంబర్ 29న సేల్ ప్రారంభం? : ఈ ఏడాది బిగ్ బిలియన్ డేస్ సేల్ సెప్టెంబర్ 29న ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ రోజు కేవలం ఫ్లిప్‌కార్ట్ ప్లస్ మెంబర్స్‌కు మాత్రమే సేల్‌కు యాక్సెస్ ఉంటుంది. మిగతా కస్టమర్లకు సెప్టెంబర్ 30 నుంచి యాక్సెస్ లభిస్తుంది. ఇది వారం పాటు లైవ్‌లో ఉండవచ్చు. గూగుల్ సెర్చ్ లిస్టింగ్‌తో సమాచారం లీక్ : ఈ ఏడాది బిగ్ బిలియన్ డేస్ సేల్ ప్రారంభ తేదీ మొదటగా గూగుల్ సెర్చ్ లిస్టింగ్ ద్వారా లీక్ అయింది. ప్రముఖ టిప్‌స్టర్ ముకుల్ శర్మ తన ఎక్స్ అకౌంట్‌లో సేల్ ప్రారంభానికి సంబంధించిన వివరాలు షేర్ చేశారు. అయితే ఫ్లిప్‌కార్ట్ దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. గూగుల్ సెర్చ్ లిస్టింగ్‌లో బిగ్ బిలియన్ డేస్ సేల్‌కు సంబంధించిన సమాచారం ఉంది. 'ప్లస్ మెంబర్స్ కోసం 2024 సెప్టెంబర్29 నుంచి బిగ్ బిలియన్ డేస్ సేల్ ప్రారంభమవుతుంది. ఫ్లిప్‌కార్ట్‌లో ఉత్తమమైన డీల్స్, డిస్కౌంట్‌లను పొందండి.' అంటూ మెసేజ్ ఉందని టిప్‌స్టర్ ముకుల్ శర్మ తెలిపారు. గతేడాది అక్టోబర్ 9న లైవ్‌లోకి : గతేడాది ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌ను అక్టోబర్‌లో ప్రారంభించింది. ప్లస్ మెంబర్స్‌కు సేల్ యాక్సెస్ అక్టోబర్ 9న లభించింది. వారం రోజుల పాటు లైవ్‌లో ఉన్న ఈ సేల్ ఈవెంట్‌లో స్మార్ట్‌ఫోన్లు, ఆడియో డివైజ్‌లు, ఫ్యాషన్, కాస్మెటిక్స్, గృహోపకరణాలు వంటి వివిధ రకాల ప్రొడక్ట్స్‌పై 80 శాతం వరకు డిస్కౌంట్లు ప్రకటించింది. కస్టమర్లకు డిస్కౌంట్ ఆఫర్లతో పాటు ప్రముఖ బ్యాంకుల కార్డులపై కొనుగోలు చేస్తే వాటిపై కూడా ఆఫర్ ప్రయోజనాలను అందించింది. ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ సాధారణంగా పండుగ సీజన్‌లో ఉంటుంది. దీపావళికి ముందు జరుగుతుంది. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌తో ఇది పోటీ పడుతుంది. కాగా, ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ బిగ్ బచత్ డేస్ సేల్ లైవ్‌లో ఉంది. ఇది ఆగస్టు 29న ప్రారంభమైంది. సెప్టెంబర్ 5 వరకు కొనసాగుతుంది. వివిధ ఉత్పత్తులపై స్పెషల్ డీల్స్, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ లావాదేవీలపై క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లు అందుబాటులో ఉన్నాయి.



# మహిళలకు ఇది చీకటి కాలం

**చట్టాలను మార్చాలంటున్న అనన్య పాండే**

ఇది మహిళలకు చీకటి కాలమని బాలీవుడ్ నటి అనన్యపాండే అన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. గతంతో పోలిస్తే ఇప్పుడు నటీమణులు వారి సమస్యలను ధైర్యంగా చెప్పగలుగుతున్నారని అన్నారు. సమాజంలో జరుగుతున్న ప్రతీ విషయం గురించి మహిళలకు అవగాహన ఉండాలి. ప్రస్తుతం చాలా దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. ఇది మహిళలకు చీకటి కాలం. ఈ దాడులను ఆపడం కోసం ఏం చేయాలో ఆలోచించాలి. మన చుట్టూ ఉండే పరిసరాలను గమనించుకుంటూ ప్రతి వ్యక్తిపైనా అవగాహన కలిగిఉండాలి. నేను ఇలాంటి పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్చిస్తూనే ఉంటాను. వాస్తవానికి చట్టాలను మార్చాల్సిన సమయం వచ్చింది. ఇది చాలా అవసరమైన నిర్ణయం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో అనన్య 'లైగర్' గురించి ప్రస్తావించారు. సినిమాల్లోని సన్నివేశాలపై హీరోయిన్లు ధైర్యంగా వారి అభిప్రాయాన్ని తెలపాలని అనన్య అన్నారు. 'నాకు ఏదైనా స్క్రిప్ట్ చెప్పినప్పుడు అది బాగా లేదనిపిస్తే.. వెంటనే స్పందిస్తాను. 'లైగర్' స్క్రిప్ట్ చదివిన తర్వాత కొన్ని మార్పులు చెప్పాను. మరికొన్ని సన్నివేశాలు మార్చాలని సూచించాను. ఆ చిత్రబృందం నా సలహాలను పాటించింది. ఎంతో ఆనందంగా అనిపించింది. ఇలా అందరూ చెప్పగలగాలి' అని వివరించారు.



# ఆదిత్య 369 కోసం చిరంజీవి ప్రచారం





బాలకృష్ణతో కలిసి ఓ ఫ్యాక్షన్ మూవీ చేయాలని ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి తన మనసులోని మాటను వెల్లడించిన సంగతి తెలిసిందే. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి బాలకృష్ణ 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఈవెంట్‌కు చిరు, వెంకటేశ్ సహా పలువురు నటీనటులు, దర్శకులు హాజరై బాలయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఇంద్ర', 'సమరసింహారెడ్డి' పాత్రలతో కథ సిద్ధం చేయాలని చిరంజీవి దర్శకులకు పిలుపునిచ్చారు. మరి అది ఎప్పుడు కార్యరూపం దాలుస్తుందో తెలియదు కానీ, ఒకప్పుడు బాలకృష్ణ సినిమా కోసం చిరు ప్రచారం చేశారు. తండ్రి నట వారసత్వం పుణికి పుచ్చుకున్న బాలకృష్ణ తన సినీ కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో అద్భుతమైన పాత్రల్లో నటించారు. అలాంటి చిత్రాల్లో 'ఆదిత్య 369' ఒకటి. . ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో చిరంజీవి పాల్గొని సందడి చేశారు. 'ఆదిత్య 369' రిలీజ్ అయిన తర్వాత మరింత ప్రచారం కల్పించడానికి, పిల్లలను, ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకర్షించడానికి నిర్మాత దూరదర్శన్‌లో ప్రకటనలు ప్రసారం చేయాలని ప్లాన్ చేశారు. చిరంజీవితో ప్రచారం చేయిస్తే మంచి ఫలితాలు వస్తాయని భావించి ఆయన్ను రిక్వెస్ట్ చేశారట. నిర్మాత అడగ్గానే వెంటనే ఒప్పుకొన్న చిరంజీవి 'ఆదిత్య 369' సినిమా యాడ్స్‌లో నటించారు. ఈ యాడ్స్ దూరదర్శన్‌లో ప్రసారం అయి ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి తోడ్పడ్డాయి. బాలకృష్ణ నటన, ఇళయరాజా సంగీతం, సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వ ప్రతిభ, చిరు ప్రచారం సినిమాకు భారీ విజయాన్ని అందించాయి.



# నటన కోసం ఎలాంటి సాహసమైనా చేస్తా

**ఐ చిత్రంలో గుడ్డివాడి పాత్ర కోసం అలాగే చేశా ● నటుడు విక్రమ్ వెల్లడి**

కథ, అందులోని పాత్ర కోసం తమని తాము మార్చుకునే, నటుల్లో విక్రమ్ ఒకరు. అంతేకాదు, కమర్షియల్ కథల కన్నా ప్రయోగాత్మక చిత్రాలకే ఆయన పెద్ద పీట వేస్తారు.అందుకే 'పితామగన్', 'కాశీ', 'అపరిచితుడు','ఐ'వంటి వైవిధ్య చిత్రాలు వచ్చాయి. ఇటీవల 'తంగలాన్'తో మరోసారి తన నట విశ్వరూపాన్ని నిరూపించారు. తాజాగా ఓ ఆంగ్ల మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.2001లో వినయన్ దర్శకత్వంలో వచ్చిన 'కాశీ' మూవీ విక్రమ్‌కు మంచి పేరు తీసుకొచ్చింది. ఇందులో ఆయన అంధుడిగా నటించారు. ఉత్తమ నటుడిగానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. పాత్ర కోసం విపరీతమైన శారీరక మార్పులకు ప్రయత్నించడం వల్ల కొన్ని సమయాల్లో భయంకరమైన పరిస్థితులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ మూవీ షూటింగ్ రోజులను గుర్తు చేసుకుంటూ 'సినిమాల్లో పాత్రకు అవసరమైనట్లు మారడం, నటించడమంటే నాకు ఇష్టం. ఇతరులతో పోలిస్తే, ఏదైనా ప్రత్యేకంగా చేయాలి. అది అందరూ చేసినట్లు ఉండకూడదు. నేను మందు తాగను, సిగరెట్ కాల్చను. కానీ, సినిమా పట్ల నాకున్న అభిరుచి నాకు విషంలాంటిది. నేను బాగా నటించాలని అనుకున్నప్పుడు అది మరింత ఎక్కువ విషంగా మారుతుంది. నేను 'కాశీ' (తెలుగులో శ్రీను, వాసంతి, లక్ష్మి) అనే మూవీ చేశా. అందులో నటించిన తర్వాత రెండు, మూడు నెలల పాటు నా కంటి చూపు మందగించింది. సరిగా చూడలేకపోయేవాడిని. ఎందుకంటే ఆ మూవీలో అంధుడిగా కనిపించడానికి కళ్లు పైకెత్తి చూడాల్సి వచ్చేది. ఆ ప్రభావం నా కంటి చూపుపై పడింది. మెల్లకన్ను వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు' అంటూ కాశీ మూవీ పూర్తయిన తర్వాత తనకెదురైన పరిస్థితిని గుర్తుచేసుకున్నారు. విక్రమ్ కెరీర్‌లోనే భారీ అంచనాలతో విడుదలైన మూవీ 'ఐ' . శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం కోసం విక్రమ్ పెద్ద రిస్క్ చేశారట. దాని ఫలితంగా మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, త్రుటిలో తప్పించుకున్నట్లు తెలిపారు. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాల ఆధారంగా దర్శకుడు పా.రంజిత్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'తంగలాన్'. ఈ సినిమా కోసం విక్రమ్ ఎంతగానో శ్రమించారు. మాళవిక మోహనన్, పార్వతి తిరువోతు కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య ఆగస్టు 15న ఇది విడుదలై దక్షిణాదిలో మంచి సక్సెస్ అందుకుంది. ఆగస్టు 30న హిందీలో ఈ సినిమా విడుదలైంది. ఇప్పటివరకూ ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా వసూలుచేసింది.



# రాజమౌళి స్ఫూర్తితో గోట్ సినిమా నిర్మాణం

గోట్' చిత్రంలో దళపతి విజయ్‌ను కొత్తగా చూపించబోతున్నాం. భారీ తారాగణం ఉన్నా ఏడాదిలో చిత్రీకరణ పూర్తి చేశాం. దీనికి స్ఫూర్తి రాజమౌళి గారే. నేను ఆయనకు పెద్ద అభిమానిని. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాను' అని దర్శకుడు వెంకట్ ప్రభు చెప్పారు. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నటుడు ప్రశాంత్ మాట్లాడుతూ 'ఇదొక అద్భుతమైన చిత్రం. ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఇంతమంది స్టార్స్‌తో ఒక సినిమా తీయడం మామూలు విషయం కాదు. వెంకట్ ప్రభు చాలా కష్టపడ్డారు. యువన్ మ్యూజిక్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అన్నారు. నిర్మాత అర్చనా కల్పాతి మాట్లాడుతూ 'ది గోట్' చిత్రం గొప్ప విజయాన్ని సాధిస్తుదనే నమ్మకం ఉంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో కలసి పనిచేయడం ఆనందంగా ఉంది. చాలా ఎక్కువ థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. సినిమాను ఎంజాయ్ చేయండి' అని ప్రేక్షకులను కోరారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'నా కెరీర్ ప్రారంభంలోనే ఈ చిత్రంతో చాలా గొప్ప నటీనటులతో పనిచేసే అవకాశం దక్కింది. విజయ్ గారు చాలా కూల్‌గా ఉంటారు. ఆయనతో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి' అన్నారు. విజయ్, వెంకట్ ప్రభుతో కలసి పనిచేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది అని లైలా చెప్పారు. చాలా రోజుల తర్వాత నా సినిమా వస్తోంది, మిమ్మల్ని అలరిస్తుంది అని స్నేహ అన్నారు.



# జనక అయితే గనక ..నవ్విస్తుందట !




సుహాస్, సంకీర్తన జంటగా నటిస్తున్న 'జనక అయితే గనక' ఈ నెల 7న విడుదల కానుంది. సందీర్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మించారు. శిరీష్ సమర్పకుడు. సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ' సుహాస్ ప్రతి సినిమాతో ఒక్కో మెట్టు ఎక్కుతున్నాడు. కొత్త కథలు అందించే ప్రయత్నం చేస్తున్నాడు. 'జనక అయితే గనక' కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. ఆద్యంతం నవ్విస్తుంది' అని చెప్పారు. సుహాస్ మాట్లాడుతూ 'కథ విన్నప్పుడు నవ్వుతూనే ఉన్నా. ఈ సినిమాను ఓవర్సీ?సలో రిలీజ్ చేస్తున్నా' అని చెప్పారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ కథ బాగుందని మెచ్చుకున్నారని దర్శకుడు సందీ?పరెడ్డి చెప్పారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com